తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 08

పేజీలు - 8

వెల- రూ 5 : 00

prajamantalu.com

ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

గురువారం 25, మే 2023


Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

# డెహ్రాడూన్ - ఢిల్లీ మధ్య వందేభారత్

## నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న మోడీ



న్యూఢిల్లీ,మే24(ప్రజా మంటలు): ఉత్తరాఖండ్‌లో తొలి వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును భారత ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ప్రారంభించనున్నారు. ఈ రైలును ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా పాల్గొననున్నారు. ఈ రైలు డెహ్రాడూన్, న్యూఢిల్లీ మధ్య నడవనుంది. ఈ ఏడాది జూన్ నాటికి దాదాపు అన్ని రాష్ట్రాలకు వందే భారత్ రైళ్లను ప్రారంభించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అంతకుముందు 2023 మే 18న పూరీ-, హౌరా మధ్య నడిచే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు.



### ప్రపంచం ముందు

# మరో ముప్పు

## కరోనాను మించిన ఉపద్రవం రాబోతోంది

## ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక



జెనీవా,మే24(ప్రజా మంటలు): ప్రపంచవ్యాప్తంగా రాబోయే కాలంలో మరో మహమ్మారి ప్రమాదం పొంచి ఉందని, రాబోయేకాలంలో తదుపరి మహమ్మారిని ప్రపంచ దేశాలు ఎదుర్కోవాల్సి ఉంటుం దని డబ్ల్యుహెచ్ఓ హెచ్చరించింది. స్విట్జ ర్లాండ్‌లోని జెనీవాలో డబ్ల్యుహెచ్ఓ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లో డబ్ల్యుహెచ్ఓ హెడ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ మాట్లాడుతూ.. 'కోవిడ్ -19 మహమ్మారి ముగింపుతో.. ప్రపంచ ముప్పు ముగిసి పోలేదు. కోవిడ్‌లాంటిదే మరో వేరియంట్ రూపాంతరం చెందే అవకాశముంది. ఈ కొత్త వేరియంట్ వల్ల.. కొత్త వ్యాధులు పుట్టుకొస్తాయి. అత్యధిక మరణాలు కూడా సంభవించే అవకాశముంది. మరో వ్యాధికారక ముప్పు మిగిలే ఉంది. కోవిడ్ - 19 మహమ్మారికంటే 'ప్రాణాంతకమైన' మరో మహమ్మారి కోసం ప్రపంచం సిద్ధంగా ఉండాలి' అని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా తదుపరి మహమ్మారిని ఎదుర్కొనేందుకు, అత్యవసర పరిస్థితులను పరిష్కరించే ప్రభావవంతమైన ప్రపంచ యంత్రాగాల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. 'తదుపరి మహమ్మారిరి పుట్టుకొస్తే.. ఆ మహమ్మారి పరిస్థితులను ఎదుర్కొనేందుకు మనమంతా నిర్ణయాత్మకంగా, సమిష్టిగా, సమానంగా సమాధానం

మిగతా... 2లో

# దశాబ్ది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి..



- అధికారులకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకలపై సీఎస్ శాంతికుమారి బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన సమావేశానికి డీజీపీ అంజనీ కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అర్విండ్ కుమార్, సునీల్ శర్మ, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా, పండుగ వాతావరణం నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, సచివాలయ, జీహెచ్ఎంసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున సచివాలయంలోకి ఎంట్రీ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని

మిగతా... 2లో

# పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించరాదు..!

- నవభారతానికి...ప్రాచీన సంప్రదాయం జోడింపు
- విపక్షాల ప్రకటనపై హోంమంత్రి అమిత్ షా
- కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు విపక్షాల ప్రకటన




న్యూఢిల్లీ,మే24(ప్రజా మంటలు): భారత దేశ నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడం నవ భారతాన్ని, ప్రాచీన సంప్రదాయాలతో అనుసంధానం చేయడమని కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా అభివర్ణించారు. దీనిని రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు హితవు పలికారు. దీని గురించి ప్రజలను ఆలోచించనిద్దామని, వారికి నచ్చిన విధంగా స్పందించనిద్దామని చెప్పారు. నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 28న ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకాబోమని 19 ప్రతిపక్ష పార్టీలు సంయుక్తంగా ప్రకటించాయి. రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి కాకుండా ప్రధానమంత్రి మోదీ పార్లమెంటు భవనాన్ని ప్రారంభించటం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని, పార్లమెంటుకు ఆత్మ వంటి ప్రజాస్వామ్యానికే

మిగతా... 2లో



### గెలుపు గుర్రాలకే

# టిక్కెట్లు

- పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మే24(ప్రజా మంటలు): కాంగ్రెస్ పార్టీలో సర్వే అధారంగానే టికెట్ కేటాయింపు జరుగుతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. గెలుపు

మిగతా... 2లో

# విద్యారంగ ప్రగతిని ప్రస్ఫుటించాలి

- తెలంగాణ విజయోత్సవాలపై సమీక్ష
- అధికారులకు మంత్రి సబిత ఆదేశాలు



హైదరాబాద్,మే24(ప్రజా మంటలు): తెలంగాణ విద్యారంగంలో గత పదేళ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో విద్యాశాఖ పనితీరుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 21 రోజుల పాటు విద్యారంగంలోని విజయాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 20న నిర్వహించే 'తెలంగాణ విద్యా దినోత్సవం' విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల నుంచి పీజీ కళాశాల వరకు అన్ని విద్యాసంస్థల్లో సభలు, సమావేశాలను నిర్వహించి విజయాలను వివరించాలని సూచించారు. సర్కారు పాఠశాలలకు సకల హంగులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'మన ఊరు ? మన బడి', 'మన బస్తీ ,మన బడి' కింద సకల వసతులతో ఆధునీకరించిన ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొలి విడతలో రూ.3,497.62కోట్లతో 9,123 స్కూళ్లను 12 అంశాలను ప్రాతిపదికగా తీసుకొని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 10వేల గ్రంథాలయాలను, 1,600 డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఒకే రోజున ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రూ.190కోట్లు ఖర్చు చేసి 30లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలు పునః ప్రారంభం

మిగతా... 2లో

### హెల్త్ సిటీగా

# వరంగల్ అభివృద్ధి


- పేదలకు అందుబాటులోకి కార్పోరేట్ వైద్యం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడి



వరంగల్,మే24(ప్రజా మంటలు): తెలంగాణలో వైద్య రంగం అద్భుతంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. వైద్యానికి సిఎం కెసిఆర్ ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తూ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో దేశంలోనే అతిపెద్ద వైద్య కేంద్రంగా వరంగల్ ఎంజీఎంను తీర్చిదిద్దుతామని మంత్రి ఎర్రబెల్లి వెల్లడించారు. అలాగే జైలు ప్రాంగణంలో అతిపెద్ద సూపర్ స్పెషలాటిలీ ఆస్పత్రి రాబోతోందని అన్నారు. వరంగల్‌లో.. దేశంలోనే అతిపెద్ద వైద్య కేంద్రంగా మారుతోందన్నారు. మెరుగైన వైద్యం కోసం పేదలు ఆస్తులు, ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదనే లక్ష్యంలో సర్కారు దవాఖానాల్లోనే నాణ్యమైన వైద్యమందిస్తున్నామని

మిగతా... 2లో

## ప్రజానాడి







# విత్తన భాండాగారంగా తెలంగాణ

- విత్తనోత్పత్తిలో ప్రత్యేక దృష్టి పెట్టాలి
- భూ వనరులు పెంచే పద్ధతులు అవలంబించాలి
- విత్తన మేళాలో మంత్రి నిరంజన్ సూచన

రంగారెడ్డి,మే24(ప్రజా మంటలు): ప్రపంచానికే విత్తన భాండాగారంగా తెలంగాణను తీర్చిదిద్దడానికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంతం విత్తనోత్పత్తికి చాలా అనుకూలమైందని, రైతాంగం ఈ విషయంపై దృష్టి పెట్టాలని కోరారు. తెలంగాణలో తయారయ్యే విత్తనాలకు ఇతర ప్రాంతాల్లో విపరీతమైన ఆదరణ ఉందన్నారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రపంచానికి విత్తనాలు సరఫరా చేసే స్థాయికి చేరుకోవాలని నిరంజన్ రెడ్డి సూచించారు. ఇప్పటికీ రాష్ట్రం కొన్ని రకాల విత్తనాలను దిగుమతి చేసుకుంటోందని, భవిష్యత్తులో దీన్ని అధిగమించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన

మిగతా... 2లో

### స్వదేశీ ఉత్పత్తులతోనే

# యువతకు ఉపాధి

- కాశ్మీర్ స్వయం సమృద్ధి దిశగా కృషి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



శ్రీనగర్,మే24(ప్రజా మంటలు): స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విదేశీ ఉత్పత్తులను తగ్గించి స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని వ్యాపారవేత్తలకు సూచించారు. కాశ్మీర్ కూడా అత్యంత వేగవంతంగా అభివృద్ధి

మిగతా... 2లో

# స్వదేశీ ఉత్పత్తులతోనే యువతకు ఉపాధి

**మొదటిపేజీ తరువాయి..**

చెందుతోందని, అనేక రకాలైన నూతన ఉత్పత్తులు దేశంలోనే తయారు కావడం అభినందనీయని అన్నారు. వందేళ్ల మన్నిక కలిగిన ఉత్పత్తులను దేశీయంగా తయారు చేస్తున్నారని తెలిపారు. పర్యాటకంగగా కాశ్మీర్ మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. జి-20 సదస్సులో పాల్గొంటున్న ఆయన తనను కలసిన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 370 రద్దుతో కాశ్మీర్ దేశంతో మమేకం అయ్యిందన్నారు. ఇది మోడీ, షాల దార్శనికత అన్నారు. ఇకపోతే పర్యావరణ పరిరక్షణలో భాగమవడం భారతీయ జీవన విధానమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలకు ఓ మంచి వాతావరణం, ప్రశాంత జీవనం అందించేందుకు కృతనిశ్చ యంతో పనిచేస్తోందని కిషన్ రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే ప్రధాని మోడీ 'మిషన్ లైఫ్'ను ఆచరణలోకి తీసుకొచ్చారన్నారు. గిరిజనులు అడవుల్లో ప్రకృతితో సహజీవనం చేస్తూ.. అదే ప్రకృతిని తమ దైవంగా భావించడమే 'మిషన్ లైఫ్' ప్రోగ్రాంకు స్ఫూర్తి అని వివరించారు. ఈ దిశగా అన్ని దేశాలతో కలిసి పనిచేసేందుకు ఇండియా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రకృతి సంరక్షణ, సంస్కృతి, సంప్రదాయాలు ఇండియాకు గొప్ప ఆస్తులని.. ప్రకృతిని ఆరాధిస్తూ దేశంలో ఎన్నో పండుగలు జరుగుతాయని వివరించారు. ఇండియా టూరిజం అభివృద్ధిలో ఇవన్నీ ప్రత్యేకమైన భూమిక పోషిస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రాలతో కలిసి పర్యాటక రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించరాదు..!

మొదటిపేజీ తరువాయి..

చోటు లేనప్పుడు కొత్త భవనానికి ఇక ఎలాంటి విలువ లేదని ఆరోపించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు దేశం పార్టీ, వైకాపా ఈ కార్యక్రమానికి హాజరు కాబోతున్నట్లు తెలిపాయి. అదేవిధంగా పంజాబ్‌లోని శిరోమణి అకాలీదళ్, ఒడిశా అధికార పార్టీ బీజేడీ కూడా హాజరుకాబోతున్నట్లు ప్రకటించాయి. తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్ గురువారం ఓ నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి కేంద్రంలోని అధికార కూటమి ఎన్డీయే పక్షాలు హాజరవుతాయి. ఈ



నేపథ్యంలో అమిత్ షా బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, భారత దేశ నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడం నవ భారతాన్ని, ప్రాచీన సంప్రదాయాలతో అనుసంధానం చేయడమని తెలిపారు. దీనిని రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు హితవు పలికారు. దీని గురించి ప్రజలను ఆలోచించనిద్దామని, వారికి నచ్చిన విధంగా స్పందించనిద్దామని చెప్పారు. ఇదిలావుండగా, కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి గతంలో జరిగిన ఇటువంటి కార్యక్రమాలను గుర్తు చేశారు. 1975 ఆగస్టులో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పార్లమెంటు అనెక్స్‌ను ప్రారంభించారని, 1987లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీపార్లమెంటు గ్రంథాలయాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. వారు అప్పుడు వాటిని ప్రారంభించినపుడు, ఇప్పుడు ప్రభుత్వాధినేత మోడీ పని ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. అయితే ఈనెల 28న జరగబోయే కొత్త పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్టు విపక్ష పార్టీలు ప్రకటించాయి. రాజ్యాంగ అధినేతగా రాష్ట్రపతి కాకుండా ప్రధానమంత్రి మోదీ పార్లమెంటు భవనాన్ని ప్రారంభించనుండటం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని, పార్లమెంటుకు ఆత్మ వంటి ప్రజాస్వామ్యానికే చోటు లేనప్పుడు కొత్త భవనానికి ఇక ఎలాంటి విలువా లేదని పేర్కొంటూ 19 విపక్ష పార్టీలు బుధవారంనాడు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.కొత్త పార్లమెంటు భవనం ప్రారంభమవుతుండటం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశం. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని బెదిరిస్తున్నా, పార్లమెంటు భవన నిర్మాణం విషయంలో విపక్షాలను ఏమాత్రం ఖాతర చేయకుండా నిరంకుశ ధోరణిలో వ్యవహరిస్తూ వెళ్లినా, ఆ విభేదాలన్నింటినీ పక్కనపెట్టి కార్యక్రమంలో పాల్గొనాలని అనుకున్నాం. అయితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పూర్తిగా పక్కనబెట్టి తానే ప్రార్లమెంటు భవనాన్ని ప్రధాని ప్రారంభించనుండటం ప్రజాస్వామ్యంపై నేరుగా జరిపిన దాడిగా మేము భావిస్తున్నాం. రాష్ట్రపతి రాజ్యాంగ అధినేతే కాకుండా, పార్లమెంటు నిర్వహణలో కీలక బాధ్యతలు కలిగి ఉంటారు. సమన్లు ఇవ్వడం, ప్రొరోగ్ చేయడం, ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంటారు. పార్లమెంటు చేసిన చట్టం అమలు కావాలన్నా రాష్ట్రపతిసమ్మతి అనివార్యం. సంక్షిప్తంగా చెప్పాలంటే రాష్ట్రపతి లేకుండా పార్లమెంటు పని సాగించలేదు. అయినప్పటికీ ఆమె లేకుండానే పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాలని ప్రధానమంత్రి నిర్ణయించారు. నిస్సందేహంగా ఇది అత్యున్నత రాష్ట్రపతి కార్యాలయాన్ని అవమానించడమే. రాజ్యాంగ స్ఫూర్తిగా పూర్తి విరుద్ధం. తొలి మహిళా ఆదివాసీని రాష్ట్రపతిగా ఎన్నుకున్నందుకు దేశం గర్విస్తున్న తరుణంలో ఆ స్ఫూర్తిని నీరుగార్చడమే అవుతుందని ఆ సంయుక్త ప్రకటనలో విపక్షాలు పేర్కొన్నాయి. అప్రజాస్వామిక చర్యలు ప్రధానికి కొత్తమే కాదు. పార్లమెంటులో విపక్ష నేతలు భారత ప్రజల సమస్యలను లేవనెత్తినప్పుడు వారిపై అనర్హత వేటు వేశారు. సస్పెండ్ చేశారు. వారి మాటలను మ్యూట్ చేశారు. మూడు సాగు బిల్లులతో సహా అనేక వివాదాస్పద చట్టాలను ఎలాంటి చర్చా లేకుండా పార్లమెంటులో ఆమోదించారు. పార్లమెంటరీ కమిటీలకు మూలన పెట్టేశారు. ఏడాదిన్నర పాటు కరోనా మహమ్మారి సమయంలో భారీ ఖర్చుతో భారత ప్రజలతో కానీ, ఎంపీసతో కానీ ఎలాంటి సంప్రదింపులు లేకుండా నిర్మాణం జరిపారు. పార్లమెంటు నుంచి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పక్కనపెట్టినప్పుడు ఇక కొత్త భవనంలో మాకు ఏ విలువా కనిపించడం లేదు. నిరంకుశ ప్రధాని, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాన్ని బాయ్‌కాట్ చేయాలని సమష్టిగా నిర్ణయం తీసుకోవడం ద్వారా ఈ విషయాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్తున్నాం అని ఆ సంయుక్త ప్రకటనలో విపక్షాలు తెలిపాయి.కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని బష్కరిస్తున్నట్టు ప్రకటించిన 19 పార్టీల్లో కాంగ్రెస్, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ), సమాజ్‌వాదీ పార్టీ, సీపీఐ, జార్ఖండ్ ముక్తి మోర్చా, కేరళ కాంగ్రెస్ (మణి), విడుదలై చిరుతైగళ్ కట్చి, రాష్ట్రీయ లోక్ దళ్, తృణమూల్ కాంగ్రెస్, జనతాదళ్ (యునైటెడ్), ఎన్‌సీపీ, సీపీఎం, ఆర్జేడీ, ఇండియన్ యూనయన్ ముస్లిం లీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, రివల్యూషరీ సోషలిస్ట్ పార్టీ, ఎండీఎంకే ఉన్నాయి.

# హెల్త్ సిటీగా వరంగల్ అభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి..**

ఎర్రబెల్లి అన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే దుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద వైద్య కేంద్రంగా వరంగల్ ఎంజీఎంను తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. 'వరంగల్ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. త్వరలో రూ.17 కోట్లతో ఎన్ఆర్ఐ సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. త్వరలోనే ఎంజీఎంలో 60 ఏళ్లు పైబడిన వారికి మోకాళ్ల శస్త్రచికిత్సలు చేసేలా చర్యలు తీసుకుంటాం. దేశంలోనే తొలిసారిగా 22 అంతస్తుల స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రి ద్వారా ప్రభుత్వ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం అని వివరించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న సమస్యల గురించి.. ఇంకా కావాల్సిన సదుపాయల గురించి చర్చిస్తున్నామని అన్నారు. త్వరలోనే వాటిని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశం, మంత్రి హరీశ్‌రావు పనితనంతో రాష్ట్రం, ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్యరంగం అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. సీఎం కేసీఆర్ వరంగల్‌ను హెల్త్‌హబ్‌గా ప్రకటించారని, హైదరాబాద్ తర్వాత ఆ స్థాయి వైద్యసదుపాయాలు వరంగల్‌లో ఏర్పాటవుతున్నా యన్నారు. ఈ సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కరోనా సమయంలో ఎంజీఎం వైద్యులు, సిబ్బంది చేసిన సేవలు మరువలేనివని, అదే తరహాలో ఇక్కడ వైద్యసేవలు నిరంతరం అందాలని ప్రజలతో పాటు ప్రభుత్వం కోరుకుంటుందని చెప్పారు. అందుకు తగ్గట్లుగా ఎంజీఎం డాక్టర్లు, సిబ్బంది ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలని, అందుకే ఎంజీఎంలు అత్యవసర, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఎంజిఎం ఆసుపత్రులో ఎన్నో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు. పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ.1100కోట్లతో 24 అంతస్తుల అత్యాధునిక మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం పనులు పురోగతిలో ఉన్నాయని, త్వరలోనే వరంగల్‌లో ప్రపంచస్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు.

# ప్రపంచం ముందు మరో ముప్పు

**మొదటిపేజీ తరువాయి..**

ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి' అని ఆయన సలహా ఇచ్చారు. అలాగే సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డిజి) కింద ఆరోగ్య సంబంధిత లక్ష్యాలకు కోవిడ్ - 19 గణనీయమైన ప్రభావాలను కలిగి ఉందని టెడ్రెస్ చెప్పారు. 2017 డబ్ల్యుహెచ్ఓ అసెంబ్లీ సమావేశాల్లో ట్రిపుల్ బిలియన్ లక్ష్యంగా పెట్టుకుంది. అంటే.. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ మందికి సార్వత్రిక ఆరోగ్య కవరేజ్ ఉందని భరోసా కల్పించడం, మరో బిలియన్ కంటే ఎక్కువ మందికి ఆరోగ్య అత్యవసర పరిస్థితుల నుండి రక్షించడం, మరో బిలియన్ కంటే ఎక్కువమందికి మెరుగైన ఆరోగ్యం కల్పించడం వంటి ట్రిపుల్ బ్రిలియన్ లక్ష్యంగా పెట్టుకుంటే.. ఈ లక్ష్యాల పురోగతిపై కూడా కరోనా ప్రభావితం చేసిందని టెడ్రెస్ అన్నారు.

# విత్తన భాండాగారంగా తెలంగాణ



**మొదటిపేజీ తరువాయి..**

'విత్తన మేళా - 2023' ని ఆయన ప్రారంభించారు. కొంతమంది రైతులకు విత్తనాలు అందించారు. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వం రైతాంగ సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చెప్పారు. సాగునీటి వసతి పెద్ద స్థాయిలో కల్పిస్తున్నామన్నారు. ఇప్పుడు తెలంగాణ అంతట నీళ్ళే కనపడుతున్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూ వనరులు పెరగవన్న విషయాన్ని రైతులందరూ గుర్తుంచుకోవాలని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పరిమిత భూ వనరుల్లోనే టెక్నాలజీని వినియోగించి, భూసారాన్ని పరిరక్షిస్తూనే అధిక ఉత్పత్తి, ఉత్పాదకతలను సాధించాలన్నారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వినియోగాన్ని తగ్గించి.. భూసారాన్ని పరిరక్షించాలని మంత్రి సూచించారు. ఈ విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. పశుపోషణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆహార శుద్ధి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యమిస్తూ.. ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ల ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి నిరంజన్ రెడ్డి వివరించారు. విత్తన మేళాలో అనేక జాతీయ, రాష్ట్రస్థాయి సంస్థలు, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ప్రదర్శనలను తిలకించి విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తన సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొండ బాల కోటేశ్వర రావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఐ. హనుమంతు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధీర్ కుమార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం. వెంకటరమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, విత్తన సంచాలకులు డాక్టర్ పి. జగన్ మోహన్ రావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వంగడాలపై విశ్వవిద్యాలయం రూపొందించిన అనేక కరపత్రాలను మంత్రి విడుదల చేశారు.

# గెలుపు గుర్రాలకే టిక్కెట్లు

**మొదటిపేజీ తరువాయి..**

ఆధారంగానే ఎంపిక ఉంటుందని అన్నారు. తనతో పాటుగా పార్టీలో ప్రతి ఒక్కరికి సర్వేనే ప్రమాణికమని చెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సీఎం సిద్దారామయ్య అడిగిన టికెట్ కాకుండా సర్వే ఆధారంగానే టిక్కెట్ ఇచ్చారని రేవంత్ తెలిపారు. కొత్తగా పార్టీలో చేరే వారికి కూడా ఇదే వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ ఠాక్రే కూడా ఇదే విషయాన్ని చెప్పారన్నారు. కర్నాకటలో విజయం తరవాత తెలంగాణలో కూడా గెలుస్తామన్న భరోసా కలిగిందన్నారు. మరోవైపు మాజీ ఎంపీ పొంగులేటి పార్టీలో చేరికపై రేవంత్ స్పందించారు.

ప్రతిపాదన వచ్చినప్పుడు దానిపై చర్చ చేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో పొత్తు లపై చర్చిస్తామని చెప్పుకొచ్చారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ మీద తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పిన రేవంత్ .. తెలంగాణ ప్రజలంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో 80 సీట్లు గెలిచి అధికారం చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు.

# దశాబ్ది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి..

**మొదటిపేజీ తరువాయి..**

పోలీస్ అధికారులకు సూచించారు. సెర్మోనియల్ పరేడ్ నిర్వహణ, జాతీయ పతాకావిష్కరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున షామియానాలు, సీటింగ్, తదితర ఏర్పాట్లు చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. సెక్రెటేరియట్‌తో రాజ్‌భవన్, అసెంబ్లీ ఇతర ప్రముఖ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని కోరారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపాన్ని పూలతో అలంకరించాలని సూచించారు. సమావేశ ప్రాంగణంలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలని, పీఏ సిస్టమ్‌తో పాటు తదితర ఏర్పాట్లను చేపట్టాలని పౌర సంబంధాల స్పెషల్ కమిషన్‌ను ఆదేశించారు. చార్మినార్, క్లాక్ టవర్ తదితర చారిత్రక కట్టడాలను ఉత్సవాలు జరిగే రోజుల్లో విద్యుద్దీపాలతో అలంకరించాలని మున్సిపల్ శాఖకు సూచించారు.

ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సంబంధిత శాఖలు నోడల్ అధికారులను నియమించాలన్నారు. సమావేశంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, శ్రీనివాస రాజు, సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్‌పిఎం రిజ్వీ, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, జైళ్ల శాఖ డీజీ , జలమండలి ఎండీ దాన కిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి, ఈఎన్‌సీ గణపతి రెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యాగారంగా మారిన తెలంగాణ

## పుల్లూరు పర్యటనలో మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట,మే24(ప్రజా మంటలు):** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో దక్షిణ భారతదేశ ధాన్యగారంగా తెలంగాణ మారిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట గ్రామీణ మండలం పుల్లూరులో మంత్రి హరీశ్‌రావు



పర్యటించారు. పుల్లూరులో నూతన పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి మంత్రి హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పుల్లూరు గ్రామంలో



బొడ్రాయి, పోచమ్మ దేవాలయం కల నిజమైంది. గ్రామ ప్రజలందరికీ ఇవాళ పండుగ రోజు అని పేర్కొన్నారు. గ్రామాన్ని అనేక రకాలుగా అన్నీ రంగాలలో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఉండేవనీ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో దక్షిణ భారతదేశ ధాన్యగారంగా తెలంగాణ మారిందని మంత్రి చెప్పారు. పుల్లూరు గ్రామానికి డబుల్ లేన్ రోడ్డు-బైపాస్ రోడ్డు రావడంతో సరికొత్త అందమొచ్చిందని, రానున్న వారం రోజుల్లో రూ.2 కోట్ల వ్యయంతో గ్రామ ఎస్సీ కాలనీ నుంచి రామంచ వెళ్లే రహదారికి పనులు ప్రారంభం చేసుకుందామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేశ్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఏంపీపీ శ్రీదేవి-చందర్, జడ్పీటీసీ శ్రీహరి గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ ప్రగతిని ప్రస్ఫుటించాలి

**మొదటిపేజీ తరువాయి..**

నాటికి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మొదటి సారిగా రూ.60కోట్లు వెచ్చించి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 12.39 లక్షల మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిస్తున్నామని, వీటిని పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2లక్షల మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.10కోట్ల ఖర్చుతో ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 26లక్షల మంది విద్యార్థులకు రూ.150 కోట్లు వెచ్చించి ఒక్కో విద్యార్థికి రెండేసి జతల యూనిఫామ్ అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, విద్యారంగంపై వెచ్చిస్తున్న మొత్తాన్ని పెట్టుబడిగా భావిస్తోందని మంత్రి తెలిపారు. సమావేశంలో పాఠశాల విద్యా సంచాలకులు దేవసేన, అధికారులు రమేశ్, జయప్రద, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పార్లమెంట్‌లో రాజదండం

### పార్లమెంటులో ఇక సెంగోల్ రాజదండం
### చారిత్రక విశేషం మరోమారు వెలుగులోకి
### ఆనాటి విశేషాలు వివరించిన అమిత్ షా

**న్యూఢిల్లీ,మే24:** కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాని మోదీ 28నజాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా మరో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించనున్నట్లు హోంమంత్రి అమిత్ షా తెలిపారు. కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్ అనే చారిత్రక రాజదండం ఉంచనున్నట్లు అమిత్‌షా మీడియాకు తెలిపారు.

కిషన్ రెడ్డి, అనురాగ్ ఠాకూర్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సెంగోల్ వెనక కొన్ని యుగాలతో ముడిపడి ఉన్న సంప్రదాయం ఉందని హోంమంత్రి అమిత్‌షా అన్నారు. అధికార మార్పిడికి చిహ్నంగా దేశచరిత్రలో సెంగోల్ కీలక పాత్ర పోషించిందన్నారు. దీనిపై ప్రధాని మోదీకి సమాచారం అందడంతో సమగ్ర విచారణ చేపట్టి దేశం ముందు పెట్టాలని నిర్ణయించారని అమిత్‌షా అన్నారు. కొత్త పార్లమెంట్ హౌస్ ప్రారంభోత్సవం రోజును ఎంపిక చేశారని హోం మంత్రి అమిత్ షా అన్నారు. సింగోల్ అంటే తమిళంలో అర్థం 'సంపదతో నిండి ఉన్నది' అని అమిత్ షా తెలిపారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన సందర్భంగా తమిళ ప్రజలు సెంగోల్‌ను అప్పటి ప్రధాని నెహ్రూకు బహూకరించారు. ఆగస్టు 14 అర్ధరాత్రి ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ రాజదండాన్ని తమిళనాడుకు చెందిన శైవమఠాధితులు తొలి ప్రధాని నెహ్రూకు అందజేశారు. తమిళనాడులోని తిరువడుత్తురై శైవ మఠ పీఠాధిపతి సూచనల మేరకు పాత మద్రాసులో ఓ స్వర్ణకారుడు సెంగెల్‌ను తయారు చేసినట్లు చరిత్ర విశ్లేషకులు చెబుతున్నారు. 'సెంగోల్' ఇప్పటి వరకు అలహాబాద్ మ్యూజియంలో 'నెహ్రూ కలెక్షన్స్' విభాగంలో భద్రంగా ఉంది.



సెంగోల్.. పూర్వం తమిళనాడును పాలించిన చక్రవర్తులు శక్తికి సూచకంగా పట్టుకునే ఓ రాజదండమని చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. 'సెంగోల్ న్యాయపరమైన పాలనకు ప్రతీక' అని తమిళ పండితుడు దేవనేయ పవనార్ రాసిన గ్రంథం 'పజాంతమిజాట్చి'లో దీని ప్రస్తావన ఉంది. సెంగోల్ తమిళంలో సెమ్మై అనే తమిళ పదం నుంచి వచ్చింది. సెమ్మై అంటే 'కోల్' అంటే రాజదండం. మన దేశ కొత్త పార్లమెంట్ భవనంలో లోక్ సభ స్పీకర్ సీటు దగ్గర 'సెంగోల్' రాజదండం ఏర్పాటు కాబోతోంది. మే 28న స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దాన్ని అక్కడ ప్రతిష్టించబోతున్నారు.

ఏ దేశానికైనా కొత్త రాజుగా పదవీ బాధ్యతలు చేపట్టే సమయంలో ప్రధాన పూజారి ఓ రాజదండం ఆయనకు అందజేసే సంప్రదాయం ఉందని చెప్పుకొచ్చారు. చోళులు ఈ సంప్రదాయాన్ని అనుసరించారని తెలిపారట. దీంతో అలాంటి రాజదండం తయారు చేసే పనిని రాజాజీకి.. నెహ్రూ అప్పగించారట. వెంటనే 1947 జులైలో రాజగోపాలాచారి తమిళనాడులో ఉన్న 14వ శతాబ్దం నాటి మఠం 'తిరువడుత్తురై ఆధీనం'కు వెళ్లి .. ఒక స్పెషల్ రాజదండం తయారు చేయించమని కోరారు.దీన్ని తయారీ పూర్తయిన తర్వాత రాజదండాన్ని ఢిల్లీకి తీసుకొని రావడానికి.. ప్రభుత్వం తరఫున ప్రత్యేక విమానాన్ని చెన్నైకి పంపారు. ఆ విమానంలో కూర్చొని 'తిరువడుత్తురై ఆధీనం' మఠం నిర్వాహకులు రాజ దండాన్ని ఢిల్లీకి తీసుకెళ్లారు. ఆ మఠానికి చెందిన స్వామిజీ ఒకరు ఆ దండాన్ని మొదట లార్డ్ మౌంట్ బాటెన్ కు అందించారు. ఆ తర్వాత అతడి నుంచి దానిని వెనక్కి తిరిగి తీసుకుని.. గంగాజలంతో శు ద్ధి చేశారు. ఆ తర్వాత ఆ రాజదండంను నెహ్రూ దగ్గరికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భారతదేశానికి అర్ధరాత్రి స్వతంత్ర ప్రకటన చేయడానికి పావుగంట ముందు దానిని భారత నూతన ప్రధానికి అందజేశారు.

## ఇక చకచకా మిషన్ భగీరథ పనులు

### పెండింగ్ పనుల పూర్తికి కసరత్తు

**మెదక్,మే24(ప్రజా మంటలు):** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం కింద మిగిలిన పనులు కూడా చకచకా కొనసాగుతున్నాయి. ఇక పనులు సత్వరం పూర్తవుతాయని అధికారులు అంటున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి ముందుకు సాగేలా ప్రణాళిక చేస్తున్నారు. విడుదలైన నిధులతో ట్యాంకు నిర్మాణం పనులు చకచకా చేపడుతున్నారు. నిర్మాణ పర్యవేక్షణను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించడంతో గడువులోగా పనులు పూర్తి చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పలు గ్రామాల్లో వివిధ దశల్లో ట్యాంకుల నిర్మాణ పనులు కొసాగు తున్నాయి. తాగునీటి ట్యాంకులు నిర్మించి సమస్యను శాశ్వతంగా అరికట్టి త్వరగా స్వచ్ఛమైన జలం అందనుందని చెబుతున్నారు.



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట లో అగ్ని ప్రమాదం, గడ్డితో సహా లారీ దగ్ధం. మెటుపల్లి నుండి మల్లన్నపేటకు ఎండుగడ్డి లోడుతో వస్తున్న లారీ కి ప్రమాదవశాత్తూ విద్యుత్తు తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. మంటలార్పిన ఫైర్ సిబ్బంది.



మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన బైర్నేని సత్యనారాయణ రావు అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను వారి స్వగృహం జగిత్యాలలో పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. వెంట పాక్స్ ఛైర్మెన్ సందీప్ రావు, సత్య నారాయణ రావు, సుమన్ రావు, రవీందర్ రావు, నాయకులు తదితరులు

## ఘనంగా సీతారాముల పరివారం విగ్రహాల ప్రతిష్ట

**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రానికి సమీపంలోని అంతర్గామ వడ్డెర కాలనీ గుట్టపై, ఎంతో అద్భుతంగా నిర్మాణమైన శ్రీ సీతా రామాంజనేయ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది . ఈనాటి విగ్రహ ప్రతిష్ట క్రతువుని ప్రముఖ, జ్యోతిష్య, వాస్తు, పౌరాణిక, వేద పండితులు, నంబి వేణు గోపాల ఆచార్య మనుమడు నంబి వాసు దేవాచార్య నిర్వహించారు. ఉదయం 08 గంటల 08 నిమిషాలకు పునర్వసు నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తమున ప్రతిష్ట మహోత్సవం జరిగింది.



ప్రతిష్ట కుంభ సంప్రోక్షణం, దృష్టి కుంభము, శాంతి కళ్యాణం ,తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం, రుత్విక్ సన్మానం తో కార్యక్రమం ముగిసింది. ఈనాటి కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే ఎం. సంజయ్ కుమార్, మాజీమంత్రి జి. రాజేశం గౌడ్, నాయకులు జితేందర్ రావు, , విశ్వహిందూ పరిషత్ నాయకులు, అశోక్ రావు, తౌటు రామచంద్రం, మహిపాల్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, వొడ్డెర కుల ప్రముకులు, పెద్దలు, భక్తులు, ఆచార్యుల బృందం, తదితరులు పాల్గొన్నారు.

### మోత్కుపల్లి గ్రామంలో

# కంటి వెలుగు శిబిరం

### ప్రారంభించిన ఎంపీపీ మాలోతు లక్ష్మీ బిల్లు నాయక్

**అక్కన్నపేట మే 24 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని అక్కన్నపేట ఎంపీపీ శ్రీమతి మాలోతు లక్ష్మీ బిల్లు నాయక్ ప్రారంబిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభు



త్వము ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకొచ్చారని పేద వర్గాలకు ఆరోగ్యంగా పేద ప్రజలు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నారని కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచు గొర్ల కుమారస్వామి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజిని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు స్థానిక ఎంపీటీసీ వేముల శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఏల్పుగొండ రవీందర్ మార్కెట్ డైరెక్టర్ పంజా సంపత్ మాలోత్ సీతారాం నాయక్ సీనియర్ నాయకులు బావు సది మండల ఐలోని అందే తిరుపతి, గొర్ల ఐలేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల సాధన కోసం నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపిన పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్. వారి వెంట మాజీ మున్సిపల్ చేర్మెన్ గిరి నాగభూషణం, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మన్సూర్ బాయ్, మాజీ కౌన్సిలర్ పుప్పాల అశోక్ తదితరులున్నారు.

### నూతన పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టి

# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

### డాక్టర్ జేరిపోతుల పరశురామ్

**జనగామ మే 24 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరును నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవన్ ఈనెల 28న ప్రారంభించడం శుభ పరిణామం కానీ అంబేద్కర్ పేరు పెట్టాలని రాజ్యసభ సభ్యులు ఓబిసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ కి కాంగ్రెస్ పార్టీ ఆదివాసి జాతీయ అధ్యక్షులు మహారాష్ట్ర మాజీ మంత్రి శివాజీ రావు మోగే ఢిల్లీలో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరుశురామ్ కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ.... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు నిద్రలేని రోజులు గడిపి భారత రాజ్యాంగాన్ని రాసి సర్వసత్తాక సామ్యవాద సర్వ బహుమాధికార గణతంత్ర రాజ్యాన్ని నిర్మించింది అంబేద్కర్ ఓటు హక్కును కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా పాలన నడిపించుటకు ఎంతో కృషి చేశారని, పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పాలన సాగిస్తున్నారు భారత రాజ్యాంగం అంటేనే అంబేద్కర్ ఆయన లేకుంటే ఈ రాజ్యమే లేదు రాజ్యాంగం పట్ల డాక్టర్ బి.ఆర్



అంబేద్కర్ పట్ల ఏ మాత్రం గౌరవం నూతన పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి ఆధ్వర్యంలో నూతన పార్ల మెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం నుండి ఢిల్లీ జంతర్ మంతర్ వరకు పల్లె నుండి ఢిల్లీ వరకు రాజాపూర్ రథయాత్ర నిర్వహించామని, దేశవ్యాప్తంగా దళిత బహుజన సంఘాలు అంబేద్కర్ ఫోటో నూతన పార్లమెంటుకు పెట్టాలని ఉద్యమిస్తున్నాయని, అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాశారని,ఈ అంశంపై కాంగ్రెస్ సిపిఐ సిపిఎం పార్టీలను కలసి మెమోరాండం ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాబ యోగి తవిటి నాయుడు నగేష్ మోహన్ దండాసి పాల్గొన్నారు.

# భాజపా జిల్లా కార్యవర్గ సమావేశం

**జనగామ మే 24 (ప్రజామంటలు):** బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకోని తెలంగాణ ప్రభుత్వం మొన్న జరిగిన అకాల వర్షాల వల్ల వేల ఎకరాలు పంట నష్టం జరగగా



ఎకరాకు పదివేల చొప్పున నష్టపరిహారం అందిస్తామని చెప్పి నేటి వరకు ఒక్క పైసా నష్టపోయిన రైతులకు అందించలేదని అన్నారు.

జిల్లాలో ఎంతోమంది నిరుద్యోగులు ఉపాధి లేక హైదరాబాద్ బొంబాయి భీమండి ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని, టీఎస్పీఎస్సీ పేపర్లు లీవ్ చేసి లక్షలాది మంది యువత మనోవేదనకు గురి చేసిందని, టీఎస్పీఎస్సీ పరీక్ష రాసిన ప్రతి అభ్యర్థికి లక్ష రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లీకేజీ కారణమైన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీలను రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుందని వారి అభ్యున్నతికి ఏమాత్రం పాటుపడడం లేదని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల జాడలేదని పేదలకు స్థలం ఉంటే ఇల్లు నిర్మాణానికి 3 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క కుటుంబానికి సహాయం అందించలేదని రాబోయే ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలు టిఆర్ఎస్ ను గద్దదింపడానికి సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు బిఆర్ఎస్కు నిజమైన ప్రత్యామ్నాయం బిజెపిని వారు తెలిపారు ఈ సమావేశంలో బిజెపి జనగామ జిల్లా ఇన్చార్జ్ కె పాపారావు గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల్ని విస్మరిస్తూ తెలంగాణ శతాబ్ది ఉత్సవాల పేరుతో మరోసారి తెలంగాణ ప్రజల్ని మోసం చేయడానికి చూస్తున్నారని రాబోయే ఎన్నికల్లో తెలంగాణ సమాజం బిఆర్ఎస్కు తగిన శాస్తి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవిఎల్ఎన్ రెడ్డి ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా ప్రచార కార్యదర్శి పెద్ద జగదీష్, జిల్లా కార్యదర్శిలు, అసెంబ్లీ ఇన్చార్జీలు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# స్కిజోఫ్రీనియా సమస్యకు సైకోథెరఫీ డాక్టర్లను కలవాలి

### గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు

### గాంధీ ఆసుపత్రిలో వరల్డ్ స్కిజోఫ్రీనియా డే

**సికింద్రాబాద్ మే 24 (ప్రజామంటలు):** స్కిజోఫ్రీనియా అనేది ఒక వ్యాధి అని, దాని సింప్టమ్స్ తెలుసుకొని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మానసిక వైద్యులను సంప్రదించి, తగిన వైద్యం పొందాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎం. రాజారావు తెలిపారు. బుధవారం ప్రపంచ స్కిజోఫ్రీనియా దినోత్సవం సందర్బంగా గాంధీ ఓపీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రాజారావు మాట్లాడుతూ.. మంత్రగాళ్ళు, చేతబడి చేసే మోసగాళ్ళతో అప్రమత్తంగా ఉండాలని, వారి వద్దకు వెళ్ళకూడదన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను వదిలి, వైద్య పరంగా సూచనలు, ట్రీట్మెంట్ పొందాలన్నారు. గాంధీ ఆసుపత్రి మానసిక వైద్య విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఎం. ఉమాశంకర్ మాట్లాడుతూ.... స్కిజో ఫ్రీనియా సమస్య ఉన్న వాళ్ళకు కుటుంబం, ఫ్రెండ్స్, సొసైటీ నుంచి తగిన ప్రోత్సాహం, సపోర్టు అవసరమన్నారు.

తనలో తాను నవ్వుకోవడం, అనుమానాలు కలిగి ఉండటం, నిద్రలేమి, ప్రవర్తన లోపాలు ఈ వ్యాధి లక్షనాలు అని తెలిపారు. గాంధీ ఆసుపత్రిలోని తమ




డిపార్ట్మెంట్లో ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స, మందులను అందచేస్తున్నామన్నారు.

ఈసందర్బంగా పీజీ, ఇంటర్న్స్ డాక్టర్లు స్ట్రీట్ ప్లే (నాటిక) ప్రదర్శించి, వ్యాధి లక్షణాలు, మంత్రగాళ్ళు చేసే మోసాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించే వైద్యసేవల గురించి, చక్కగా వివరించారు. కార్యక్రమంలో అప్తమాలాజీ హెచ్ఓడీ డా. రవిశేఖర్ రావు, ఆర్ఎంవోలు డాక్టర్ వెంకటరమణ, డా.నజీమ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిర, సైకోథెరపీ అసోసియేట్ ప్రొ. డా.అజయ్, డా. సురేశ్, డా. అనుపమ, పీజీ, ఇంటర్న్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# జిల్లాలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య

**జనగామ మే 24 (ప్రజామంటలు):** జనగామ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై అదనపు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి రోజువారి కార్యక్రమం విజయవంతం చేయుటకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రగతిపై అన్ని శాఖల అధికారులు వివరాలు సమర్పించాలని



కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డిసిపి సీతారామ్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమం జూన్ 2 నుండి 22 వరకు (21) రోజులు జరిగే కార్యక్రమాలకు జిల్లా ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డిఓలు సిహెచ్ మధుమోహన్, కృష్ణవేణి డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామిరెడ్డి, ప్రణాళిక అధికారి ఇస్మాయిల్, ఎలక్ట్రిసిటీ ఎస్సీ వేణుమాధవ్, డిఏఓ వినోద్ కుమార్, డిఎస్ఓ రోజా రాణి, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఔరంగాబాద్ రోడ్ ప్రమాదం

### చౌటపల్లికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు మృతి

### బంధువుల అంత్యక్రియలకు వచ్చి మృత్యువాత

**అక్కనపేట్ మే 24 (ప్రజామంటలు):** మహారాష్ట్రలోని ఔరంగాబాద్లో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తెలంగాణలోని సిద్దిపేట జిల్లా అక్కన పేట్ మండలం చౌటపల్లికి గ్రామానికి చెందిన నలుగురు మృతిచెందారు. చనిపోయిన నలుగురూ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఎరుకుల కృష్ణ, సంజీవ్, సురేష్, వాసుగా గుర్తించారు. బంధువుల అంత్యక్రియ



లకు వచ్చి సూరత్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అన్నదమ్ములు నలుగురూ కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం గుజరాత్లోని సూరత్కు వెళ్లారు. ఐదురోజుల క్రితం వీరి స్వగ్రామమైన చౌటపల్లిలో బంధువు ఎరుకల కనుకయ్య మృతి చెందారు. దీంతో అతడి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఈ నలుగురూ తమ కుటుంబ సభ్యులతో కలిసి చౌటపల్లికి వచ్చారు. కుటుంబసభ్యులను చౌటపల్లిలోనే ఉంచి అన్నదమ్ములు తిరిగి సూరత్కు మంగళవారం కారులో బయల్దేరారు. అదే రోజు రాత్రి మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

## కోరుట్ల డిపో సందర్శించిన ఆర్ఎం సుచరిత

**కోరుట్ల, మే 24 (ప్రజామంటలు):** కోరుట్ల డిపోను నూతనంగా వచ్చిన రీజనల్ మేనేజర్ సుచరిత సందర్శించారు. డిపో మేనేజర్ లక్ష్మీప్రసన్న పూల బొకేతో ఆహ్వానం పలకినారు.ఈ సందర్భంగారీజినల్ మేనేజర్ సుచరిత మాట్లాడుతూ అన్ని పా రామీటర్లలో డిపోను ముందంజలో






ఉంచాలని, అన్నారు తర్వాత డిపోలో మొక్కను నాటి అన్ని సెక్షన్లను సందర్శించి అత్యధిక ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు మరియు కండక్టర్లకు క్యాష్ అవార్డులను అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరిండెంట్ వెంకటేశం, మెకానికల్ ఫోర్ మెన్ తిరుపతి, టిఐ2 రమేష్, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఇండ్ల స్థలాలు లేని ప్రతి మనిషికి

# 125 గజాలు ఇవ్వాలి

**కోరుట్ల టౌన్ మే 25 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని పూలే అంబేద్కర్ నగరంలో 45వ రోజులుగా సిపిఎం పార్టీ చేస్తున్న ఇండ్ల పోరాటానికి సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ఇండ్ల పోరాటానికి మద్దతుగా తెలపడం జరిగింది. ఆయన మాట్లాడుతూ....



సిపిఎం పార్టీ 45 రోజులుగా చేస్తున్న ఇళ్ల పోరాటానికి సిపిఐ మద్దతు ఇస్తున్నాము అని చెప్పారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 58వ జీవో ప్రకారం ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల,కేంద్ర ప్రభుత్వం 10 లక్ష రూ"లుఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, రాజ్యాంగబద్ధంగా ప్రతి మనిషికి ఇల్లు లేని వారికి ఇల్లా స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు, అధికార దాహంతో భయపెట్టాలని చూస్తున నిరుపేదలకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు ఇళ్ల స్థలాలు ఇచ్చేదాకా భూ పోరాటం ఆపేది లేదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వెన్నెమ్ సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శివనాథ్, సిపిఎం జిల్లా కన్వీనర్ జి తిరుపతి నాయక్, పోరాట కమిటీ సభ్యులు రజియా సుల్తానా, చిలుక ఉమా, మొబీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎల్కతుర్తి మండలం నుండి అంబాల జీవన్ ఎంపిక. మండల స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించి జిల్లా స్థాయిలో కూడా ఫస్ట్ ర్యాంకు సాధించి రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం తోటి విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.



# పేదల బియ్యం..పెద్దలకు ఆదాయం!

తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం గుదిబండగా మారింది. పేదల కు పట్టెడన్నంపెట్టాల్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆరామారావు కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారు. దాదాపు 40 ఏళ్ల కిందటి మాట. కానీ ఇప్పుడు అదే బియ్యం ధర 40 నుంచి 50కిచేరింది. కానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కిలో రూపాయకే బియ్యం ఇస్తున్నారు. ఈ బియ్యాన్ని అమ్ము కోవడం, వ్యాపారంచేసుకోవడం అన్నది జరుగుతోంది. చాలామంది హోటళ్లకు అమ్ముకుంటు న్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దాదాపు 20రూపాయలకు పైగగానే సబ్సిడీ ఇస్తోంది. ఇలా ఖర్చుతో కూడుకున్న పథకం అమలు చేయడం ఎంతవరకు న్యాయం. ప్రజల డబ్బును దుబారా చేస్తున్న ఈ పథకం విధానాన్ని సమీక్షించాలి. పక్కదారి పడుతున్న పథకంపై కన్నేయాల్సిందే. నిరుపేద లకు ఉచిత పథకాలపై సమీక్షించ కుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృథా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవు తున్నారు. రేషన్ దుకాణాల సమయ పాలనకు తిలోదకాలు ఇవ్వడం,నిత్యావసర సరకులు వచ్చినా రాలేదని గద్దించడం, కార్డులను డీలర్లు తమ వద్దే ఉంచుకొని బియ్యాన్ని స్వాహా చేస్తూ రాష్ట్రాలను దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమాయక ప్రజలు చేసేది లేక ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలు చేశారు. ఆనాడది సంచలన నిర్ణయంగా నిలిచింది. ఆ తరవాత చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. ఇలా చేయడం వల్ల కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు దాగి ఉన్నాయి. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా అక్రమాలకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల ఏదో ఘనకార్యం చేశామని గొప్పగా ప్రకటించుకున్నారు. ఎపిలో ఇప్పుడు సన్నబియ్యం ప్యాకెట్లలో సరఫరాకు శ్రీకారం చుట్టడంతో



ఇక ఇదో వ్యాపార పథకంగా మారనుంది. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. బియ్యం పథకంపై ఆజమాయిషీ లేకపోవడం వల్ల చౌక బియ్యాన్ని తినడానికి బదులు అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవు తున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. పాలకుల దూరాలోచన లేని కారణంగా ఈ బియ్యం కేవలం వ్యాపార దృక్పథంతో సాగుతున్నాయి. తాజాగా ఎపిలో ప్యాకింగ్ కవర్లలో ఇవ్వడం వల్ల మరింత ఖర్చుతో కూడుకున్నదిగా మారింది. సన్నబియ్యం రూపాయికే వస్తాయా అన్నది ఆలోచించడం లేదు. వాటిని ప్యాక్ చేయడానిక మెరో రెండు రూపాయల వరకు ఖర్చు కాగలదు. రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తాన్ని రైతుల కు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు.

ఎపి విడిపోయిన తరవాత కూడా ఇంకా ఈ పథకాన్ని అమలు చేస్తున్న తీరు కారణంగా అవినీతి పెరిగి పోతోంది. వేలకోట్లు ఈ పథకం కోసం ఖర్చవుతున్నా మళ్లీ సమీక్ష చేయలేక పోతున్నారు. ఎక్కడ ఓట్లు పోతాయో అన్న అభయం వెన్నాడుతున్నట్లుగా ఉంది. రేషన్ కార్డులు తగ్గిం చడమంటే పేదవారికి బియ్యం దక్కకుండా అడ్డుకోవడం కాదు. రేషన్ బియ్యం తినే ప్రతిఒక్కరికీ బియ్యం అందిస్తాం అంటూ ప్రజలు కట్టే పన్నులకు పాతరేస్తున్నారు. చౌకధరలకు తీసుకుని బయట అమ్ముకునే వారిని గుర్తించి తొలగించడం లేదు. కార్డులు తగ్గించకున్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వా లనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరల కుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## 'ఆడుతూ పాడుతూ చదువు'

అది తెలంగాణలోని ఒక చిన్న పల్లెటూరు. పేరు రామారెడ్డి. నా పేరు సరస్వతి. మా ఇంట్లో అక్క నేను చెల్లి. నాన్న శేఖర్ శర్మ అమ్మ సుమతి. అదే ఊళ్ళో అబ్బాయిల స్కూల్లో తెలుగు టీచర్. అడుగడుక్కి



ఆంజనేయస్వామి గుళ్ళు,ఇంకా ఊరవతల అందమైన చెరువు, ఆ గట్టు మీద 'ప్రభుస్వామి' అని లింగమూర్తి గా ఉన్న శివుని గుడి,ఊరికి ఇంకో చివర 'పులిగోరి' గుడిగ పిలువబడే ఇంకో శివుని గుడి, మధ్య ఊరిలో రాముడు, శివుడు గుళ్ళు. శివాలయంలో అందంగా అలంకరించబడి అద్దంలో దర్శమిచ్చే అమ్మవారు అన్నపూర్ణ, అప్పుడప్పుడే పేరు వస్తున్న కాలభైరవ స్వామి గుడి ఇట్ల ఆధ్యాత్మికంగా,ఆనందంగా, అందంగా ఉన్న ఊరే రామారెడ్డి. ఆ ఊళ్ళో అమ్మాయిలకు,అబ్బాయిలకు విడివిడిగా పదవతరగతివరకు పాఠశాలలున్నయి. సుమారు నలభై సంవత్సరాల క్రితం టీచర్లు ఏ ఊళ్ళో పనిచేస్తుంటే ఆ ఊళ్ళోనే ఉంటుండేది. టీచర్ల పిల్లలు కూడ అవే స్కూళ్లల్లో చదివేది. అప్పుడు ప్రయివేట్ స్కూళ్ళు లేవనుకోండి.

ఇంక మామూలే కదా ఇటు ఊళ్ళో-అటు స్కూల్లో రాజకీయాలకు ఏం తక్కువలేదు. అంతే కదా!అన్ని ఊళ్ళల్లో అది సాధారణ విషయం. గ్రామాల్లో గ్రామ అధికారులు కూడా టీచర్ల పని విషయాల్లో కల్పించుకోవడం పంద్రాగస్టుకి, చబ్బీస్ జనవరికి,చాచా నెహ్రూ పుట్టిన్రోజుకి, ఇట్ల స్కూళ్లళ్ళో జరిగే కార్యక్రమాలకి రావడం మాట్లాడడం, సూచనలు, సలహాలు చెప్పడం జరుగుతుండే.

పల్లెటూరు కనుక టీచర్ల మధ్యన కూడా సబ్జెక్టుల పరంగా,వాళ్ళ వాళ్ళ పిల్లల తెలివితేటల పరంగా,ఆస్తిపాస్తుల పరంగా ఏవో రాగద్వేషాలు కూడా కొన్నిసార్లు చిన్నగా, కొన్నిసార్లు పెద్దగా బయటపడేవి. ఆ సమయాల్లో కూడా గ్రామాధికారి రామనాథం చొరవ తీసుకొని సర్ది చెప్పేది చాలా ఓపికగా సంయమనంతో, ఎవరూ నొచ్చుకోకుండా.

ఆ రోజుల్లో ఏడవతరగతికి, పదవతరగతికి బోర్డ్ పరీక్షలు ఉండేవి. చాలా మంది పిల్లలు ఏడు లోనే ఫెయిల్ ఐ చదువు మానేసేది. పది వరకు వచ్చేటప్పటికి దాదాపు పది పన్నెండు లేదా పదిహేను మంది పిల్లలు ఉంటే అది గొప్ప.

ఏడవతరగతి, పదవతరగతికి ట్యూషన్ చెప్పడానికి గోపాల్ రెడ్డి సారు అని, నర్సింహ చారి సారు అని ఇద్దరు సార్లుండేది. మిగతవాళ్ళకన్న వీళ్ళుఇద్దరి దగ్గరికి మిగతా టీచర్ల పిల్లలు, ఇంకా ఊళ్ళో వాళ్ళు పిల్లలని పంపేది.

అట్ల అప్పుడు నేనూ పదిలో ఉన్నాను. లెక్కలంటే నాకు భయం. ఎంత అర్థం చేసుకుందామని ప్రయత్నించిన చెమటలు వస్తుండే లెక్కలు రాకుంటుండే. గోపాల్ రెడ్డి సర్ కి కోపం చిరాకు బాగా. మా నాన్న కూడ తెలుగు టీచరే. నాన్న సర్ కి మా అమ్మాయి కూడా వస్తుందని సర్ ఇంటిదగ్గర నన్ను కూర్చోబెట్టి వెళ్ళిపోయాడు. సర్ చాలా విసుగ్గా నన్ను చూసి మీ నాన్న పైసలు ఇస్తాడో లేదో ఊరికే చెప్పుడైతదేమో అని విసుక్కున్నాడు. నాకు ఇంకా ఎక్కువ భయం, ఒక రకమైన అసహాయతా. కళ్ళల్లో నీళ్ళు దుంకడానికి సిద్ధంగా ఉంటుండే.

ఆ పరిస్థితుల్లో లెక్కలు నాకు రాలేదు. ఒకరోజు గోపాల్ రెడ్డి సర్ నన్ను ఇంకో అమ్మాయిని, ఒక అబ్బాయిని బయట నిల్చోబెట్టాడు. అదే దారిలో అప్పుడే గ్రామాధికారి రామనాథం గారు వెళ్తూ మా ముగ్గుర్ని చూసి ఆగి మమ్మల్ని లోపలికి తీసుకెళ్లి సర్ ని అడిగాడు ఏం జరిగిందని.


సర్ చాలా గట్టిగా అసలు చెప్పి చెప్పి నా నోరు పోతుంది అయ్యా! "మొద్దులు, వెధవలు బుర్ర లేదు నేర్చుకోవాలన్న ఇంగితం ఇసుమంత కూడా లేదు. మీరు కూర్చోండి కావాలంటే నిరూపిస్తా ఒక చిన్న లెక్క కరెక్టుగా చేసినా నేను వీళ్ళకి ఫీ తీసుకోకుండా లెక్కలు చెప్తా" అని చెప్పగానే రామనాథం గారు ఇలా అన్నారు సర్ తో "గోపాల్ రెడ్డిగారూ పిల్లల ముందు ఇది చెయ్యండి, అది చెయ్యండి అని పందెములు, ప్రతిజ్ఞలు ఎందుకు సర్ మీరు మీ వంతుగా ఒకసారి రెండుసార్లు వివరంగా చెప్పండి చాలు. అర్థం కాకుంటే మీ తప్పు కాదు. మీరు డబ్బు కోసమే అయితే వారి తలిదండ్రులకు ఖచ్చితంగా చెప్పండి ఊరికే నేను చెప్పనని అంతే గాని పిల్లలని బాధపెట్టకండి మీ మాటలతో". అని సుతిమెత్తగా సర్ కి చెప్పి నన్ను మిగతా పిల్లలని వెంటబెట్టుకొని ఎవరిళ్లదగ్గర వాళ్ళని వదిలేసి నాతో మా ఇంటికి వచ్చారు రామనాథం గారు.

నాన్న ఇంట్లోనే డైరీలో లెక్కలు రాసుకుంటున్నాడు. శర్మ గారూ డబ్బు లేకపోతే మీరే కొద్ది సేపు పక్కన కూచోబెట్టి చదివిస్తే అయిపోతుంది కదా. అనగానే నాన్నకి అర్థమైంది. ఆ రోజునుండి మా అక్కను, చెల్లిని కూడ కూచోబెట్టి పుస్తకాలలో ఆ రోజు చెప్పిన పాఠాలు మళ్లీ ఒకసారి చదివిస్తుండే. లెక్కల్లో మామూలుగా మార్కులు వచ్చినా మిగతా వాటిల్లో అరవై ఐదుకి పైగా వచ్చినయ్ మార్కులు. ఇంట్లోనే హాయిగా రోజూ చదువుకోవడం మంచి ఫలితాలు ఇచ్చింది.

- డా. భోజన్నగారి అనసూయ
నిజామాబాద్. 99898 22494

## సీజనల్ వ్యాధుల నివారణకు ముందే మేల్కోవాలి

వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఓనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమ్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. కరోనా కారణంగా ఇప్పుడా భయం తగ్గింది. అయితే కరోనా వల్ల ఓ మంచి మాత్రం జరిగింది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలకు అలవాటు పడుతున్నారు. ఇది కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది.




చలికాలం వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్థాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. అయితే కరోనా పరిస్థితి కారణంగా ఇప్పుడు ప్రజలకు గుణపాఠం వచ్చిందనే చెప్పాలి. అయితే ఇది ఎంతకాలం అన్నది కూడా చూడాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతు న్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవు తుందని అధికారులు అభిప్రాయ పడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సి పాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుధ్య నిర్వ హణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పుర పాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు.

## వివిధ కార్తెలపై తెలుగు రైతుల సామెతలు

తెలుగు రైతులు తరతరాలుగా తమ అనుభవాలలోనుంచి సంపాదించుకున్న వ్యవసాయ వాతావరణ విజ్ఞానాన్ని 'కార్తెలు', వాటిపై సామెతల రూపంలో ప్రచారం చేశారు. ఆయా కార్తెలలో పైరులకు వాతావరణం ఎలా ఉంటుందో అందరికీ అర్థమయ్యేలా సామెతల రూపాల్లో వ్యవసాయ విజ్ఞానాన్ని దాచారు. తరువాతి తరాలకూ ఆ జ్ఞానం అందేలా చేశారు.

**అశ్వని:** అశ్వని కురిస్తే అంతా నష్టం, అప్పులు ఖాయం, అశ్వని కురిస్తే ఆరు కార్తెలు విడుపు, అశ్వని కురిస్తే అడుగు తడవదు, .

**భరణి' :** భరణిలో పుట్టిన ధరణి ఏలును భరణి కురిస్తే ధరణి పండును, భరణి ఎండకు బండలు పగులుతాయి. భరణిలో చల్లిన



నువ్వు చేను కాయకు బరిగెడు గింజలు. భరణి కార్తెలో చల్లిన కాయకు చిప్పెడు పంట.

**కృత్తిక:** కృత్తిక పునర్వసులు సత్తువ పంట.కార్తె ముందర ఉరిమినా కార్యం ముందర పదిరినా చెడుతుంది.

**రోహిణి:** రోహిణి ఎండకు రోళ్ళు పగులును. రోహిణిలో విత్తనం రోళ్ళు నిండనిపంట. రోహిణి ఎండకు రోళ్ళో పాయసం ఉడుకును.

**మృగశిర:** మృగశిర కార్తెలో ముంగిళ్ళు చల్లబడును. మృగశిర కురిస్తే ముసలెద్దు రంకె వేయును. మృగశిరకు ముల్లోకాలు చల్లబడును. మృగశిర బిందె ఇస్తే ఇరు కార్తెలు ఇంకా ఇస్తాయి. మృగశిరలో బెట్టిన పైరు, మీస కట్టిన కొడుకు మేలు. మృగశిరి వర్షిస్తే మఖ గర్జిస్తుంది. మృగశిర కురిస్తే ముంగాలి పండును. మృగశిర చిందిస్తే అయిదు కార్తెలు వర్షించును.

**ఆరుద్ర:** ఆరుద్ర కార్తె విత్తనానికి అన్నం పెట్టిన ఇంటికి సేగి లేదు. ఆరుద్ర కురిస్తే ఆరు కారెలు కురుస్తాయి. ఆరుద్ర కరుణిస్తే దారిద్ర్యము లేదు.ఆరుద్ర చిందిస్తే అరవై దినాల వరపు. ఆరుద్ర మొదటి పాదాన ఎత్తితే ఆరంభాలు చెడు. ఆరుద్రతో అదనుసరి. ఆరుద్రలో అడ్డెడు చల్లితే 'పుట్టెడు'పండుతాయి. ఆరుద్ర వాన ఆదాయాల బాన. ఆరుద్ర వానకు ఆముదాలు పండుతాయి. ఆరుద్రలో వేసినా, అరటి ఆకులో పెట్టిన అన్నము ఒక్కటే. ఆరు కార్తెలు పోతే ఆరుద్ర దిక్కు. ఆరుద్రలో వర్షం, అమృతంతో సమానం. ఆరుద్ర వాన అరుదు వాన. ఆరుద్ర ఉరిమితే ఆరు వానలు పడుతాయి

**పునర్వసు:** పునర్వసు, పుష్యాలకు పూరేడు గుత్తయినా తడవదు.

**పుష్యమి:** పుష్యమి కురిస్తే ఊరపిట్ట గూడ తడవదు.పునర్వసు పుష్యమి కార్తెలు వర్షిస్తే పూరేడు పిట్ట అడుగైనా తడవదు.

**ఆశ్లేష:** ఆశ్లేష ఊడ్పు ఆరింతలవుతుంది. ఆశ్లేష కురిస్తే ఆరోగ్యం. ఆశ్లేష వాన అరికాలు తేమ. ఆశ్లేషలో ముసలెద్దు గూడ రంకె వేయును. ఆశ్లేష ముసురు - ఆగి ఆగి తుంపర కురియును. ఆశ్లేషలో అడుగున కొక చిగురైనా అడిగినన్ని వడ్లు ఇస్తుంది. ఆశ్లేషలో అడ్డెడు చల్లటం - పుట్టెడు ఏరుకోవటం. ఆశ్లేషలో ఊడ్చిన - అడిగినంతపంట. ఆశ్లేష వర్షం - అందరికి లాభం. ఆశ్లేష వాన అరికాలు తేమ

**మఖ:**మఖ మానికంత చెట్టయితే - కార్తీకానికి కడవంత గుమ్మడికాయ. మఖ పుబ్బలు వరుపయితే మీ అన్న సేద్యం, నాసేద్యం మన్నే. మఖలో విత్తనాలు చల్లితే మచ్చలు కనపడతాయి. మఖలో పుట్టి పుబ్బలో మాడినట్లు. మఖలో మానెడు పుబ్బలో పుట్టెడు. మఖా పంచకం సదా వంచకం. మఖ పుబ్బలు వొరుపైతే మహత్తరమైన కాటకం. మఖ ఉరిమితే మదురుమీద కర్రయినా పండును.

**పుబ్బ:** పుబ్బలో చల్లినా, బూడిదలో చల్లినా ఒకటే. పుబ్బలో చల్లేది, మబ్బుతో మొరపుట్టుకునేది. పుబ్బ ఉచ్చిచ్చి కురిసినా గుబ్బిబ్బి చెట్టు కింద నానదు. పుబ్బ కెరివితే భూతం కెరివినట్లు. పుబ్బ రేగినా బూతు రేగినా నిలవదు. పుబ్బలో చల్లే దాని కంటే దిబ్బలో చల్లేది మేలు. పుబ్బలో పుట్టెడు చల్లే కంటే మఖలో మానేడు చల్లటం మేలు. పుబ్బలో పుట్టెడు చల్లే కంటే ఆశ్లేషలో అడ్డెడు చల్లటం మేలు. పుబ్బలో పుట్టి మఖలో మాడినట్లు.

**ఉత్తర:** ఉత్తర చూసి ఎత్తరగంప - విశాఖ చూసి విడవరా కొంప. ఉత్తర ఉరిమినా, త్రాచు తరిమినా తప్పదు. ఉత్తర ఉరిమి తప్పినా, రాజు మాట తప్పినా, చెదపురుగుకు రెక్కలు వచ్చినా కష్టం. ఉత్తర పదును ఉలవకు అదును. ఉత్తరలో ఊడ్చేకంటే గట్టుమీద కూర్చొని ఏడ్చేది మేలు. ఉత్తర హస్తలు వృష్టికి ప్రమాణం. ఉత్తర వెళ్ళాక వరి ఊడ్పులు కూడదు

**హస్త:** హస్త ఆదివారం వస్తే చచ్చేటంత వాన హస్త కార్తెలో చల్లితే అక్షింతలకయినా కావు. హస్తకు ఆధిపంట - చిత్తకు చివరిపంట. హస్తకు ఆరు పాళ్ళు - చిత్తకు మూడు పాళ్ళు. హస్తపోయిన ఆరుదినాలకు అడక్కుండా విత్తు. హస్తలో అడ్డెడు చల్లేకంటే - చిత్తలో చిట్టెడు చల్లేది మేలు. హస్తలో ఆకు అల్లాడితే - చిత్తులో చినుకు పడదు. హస్తలో ఆకు అల్లాడితే చిత్తులో చినుకు పడదు. హస్తలో చల్లితే హస్తం లోకి రావు. హస్త కార్తెలో వానవస్తే అడుగకనే గొర్రెలు కట్టు. హస్త ఆదివారం వచ్చింది చచ్చితిమయ్యా గొల్లబోయల్లారా మీ ఆడవారినగలమ్మి అడ్డ కొట్టాలు వేయించండి అన్నవట గొర్రెలు.



-ఆర్కె సంగనభట్ల
9440595494

**చిత్త:** చిత్త కురిస్తే చింతలు కాయును. చిత్త చినుకు తన చిత్తమున్న చోట పడును. చిత్తి ఎండకు బట్టతల పగులును. చిత్తలో చల్లితే చిత్తుగా పండును. ఉలవలు, చిత్తకు చిరుపొట్ట. చిత్త, స్వాతులు కురవకుండా ఉంటే చిగురాకుగూడ మాడిపోవును. చిత్త నేలలో దుక్కి - పుటం పెట్టిన పుత్తడి. చిత్త చిత్తగించి స్వాతి చల్లజేసి విశాఖ విసరకుంటే అనూరాధలో అడిగినంత పండుతాను అన్నదట వరి. చిత్త చిత్తం వచ్చిన చోట కురుస్తుంది. చిత్త ఎండకు పిట్ట తల పగులుతుంది. చిత్త స్వాతుల సందు చినుకులు చాలా దట్టం.

**స్వాతి:** స్వాతి కురిస్తే చట్రాయి గూడపండును. స్వాతి కురిస్తే చల్లపిడతలోకి రావు జొన్నలు. స్వాతి కురిస్తే భీతి కలుగును. స్వాతి కురిస్తే మూడు కార్తెలు కురుస్తాయి. స్వాతి కొంగ, పంటకాపు (రైతు) నీళ్ళున్నచోటే ఉంటారు. స్వాతి కొంగల మీదికి సాళువం పోయినట్లు. స్వాతి వానకు సముద్రాలు నిండును. స్వాతి వాన ముత్యపు చిప్పకుగాని, నత్తగుల్లకే. స్వాతి సముద్రాన్ని చంకన బెట్టుకొస్తుంది. స్వాతీ! నేను జవురుకొస్తాను - విశాఖా నువ్వు విసురుకురా అన్నదట.

**విశాఖ:** విశాఖ వర్షం - వ్యాధులకు హర్షం. విశాఖ కురిస్తే పంటకూ విషమే. విశాఖ వర్షం దున్నలకు మాదిగలకు ఆముదాలకు బలం. విశాఖ విసురుతుంది.

**అనూరాధ:** అనూరాధ కార్తెలో అనాథ కర్రయినా ఈనుతుంది. అనూరాధలో కురిస్తే (తడిస్తే) మనోరోగాలు పోతాయి.

**జ్యేష్ట:** జ్యేష్ట చెడకురియును - మూల మురగ కురియును.

**మూల:** మూల కార్తెకు వరి మూలన జేరుతుందిమూల ముంచుతుంది. మూల కురిస్తే ముంగారు పాడు. మూల పున్నమి ముందర మాదిగైనా చల్లడు. మూల మంటే నిర్మూల మంటాడు. మూలలో చల్లిన ఉలవలు మూడుకాయలు ఆరు పువ్వులుగా పండును. మూల వర్షం ముంచితే జేష్ట వర్షం తేలుస్తుంది.

**రేవతి:** రేవతి వర్షం రసమయం - రమణీయం. రేవతి వర్షం అన్ని పంటలకు రేణింపే. రేవతి వర్షం సర్వ సస్యములకు రమణీయం.

## మరింత పటిష్టంగా దిశచట్టం

ఎపి సర్కార్ ఓ సంచలన నిర్ణయం తీసుకుని దిశ చట్టాన్ని తీసుకుని వచ్చినా లైంగిక వేధింపులు, ప్రేమదాడులు ఆగడం లేదు. మృగాళ్లు విజృంభిస్తూనే ఉన్నారు. అత్యాచార ఘటనలు సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నా రోజూ ఎక్కో ఒకచోట ఘటనలు తారసపడుతున్నాయి. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. దిశ లాంటి ఓ పటిష్ట చట్టం తీసుకుని రావడం నిజంగా అభినందనీయం అనుకున్న వారు కూడా ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ ఎపి సిర్కార్ దిశ చట్టాన్ని తీసుకుని వచ్చింది. మహిళలు, బాలికలపై అత్యాచారాలు వంటి అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా దిశ చట్టాన్ని రూపొందించారు. దీనిని నిర్ధారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకొచ్చింది. ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21 వర్కింగ్ డేస్ ల్లో తీర్పు వచ్చేలా క్రిమినల్ లా చట్టంలో మార్పులు చేసారు. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. దిశలో భాగంగా మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం జరిగింది. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు ప్రకటించారు. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది.

# తెలంగాణలో తాలిబన్ల రాజ్యం

### మరోమారు విమర్శలు గుప్పించిన షర్మిల

### ఆస్పత్రిలో అడ్వకేట్ యుగంధర్‌కు పరామర్శ

**హైదరాబాద్,మే24(ప్రజా మంటలు):** సీఎం కేసీఆర్ తెలంగాణను ఆఫ్ఘనిస్తాన్ లాగా మార్చారని, తాలిబన్ల నాయకుడు కేసీఆర్ అని వైఎస్ షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో తాలిబన్ల రాజ్యం నడుస్తోందన్నారు. బోడుప్పల్ అభయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అడ్వకేట్ యుగంధర్‌ను షర్మిల వెళ్లి పరామర్శించారు. ఆయన అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన షర్మిల.. దళితబంధులో జరిగిన అక్రమాలను ఆధారాలతో సహా నిరూపిస్తే సర్కార్ ఇచ్చిన బహుమతి దాడి చేయడమేనా అని ప్రశ్నించారు. దళిత బిడ్డ మీద దాడులు జరిగితే పోలీసులు కేసు కూడా నమోదు చేసుకోలేదన్నారు. దళితులను కేసీఆర్ మోసం చేశాడని షర్మిల...రాష్ట్రంలో - దళితులకు కనీస గౌరవం కూడా లేదన్నారు. దళితులంటే ఓట్లేసే యంత్రం లాగే చూస్తున్నారని, దళితుల కోసం పెట్టిన ప్రతి పథకమూ మోసమేనని అన్నారు. కేసీఅర్ దళిత ద్రోహి అని మండిపడ్డారు.పోలీసులను సైతం కేసీఆర్ ప్రైవేటు సైన్యం లాగా వాడుకుంటున్నారని షర్మిల ఆరోపిం చారు. తిరుమలగిరిలో అఖిలపక్షం అధ్వర్యంలో ధర్నా చేద్దామని చేద్దా మని అనుకున్నామని కానీ పోలీసులు తమ ధర్నాకు అనుమతి ఇవ్వలేద న్నారు. - బంగారు తెలంగాణలో ప్రజల పక్షాన నిలబడటం ఘోరమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోరాటం చేయాలంటే ప్రతిపక్షాలకు స్వేచ్ఛలేదన్నారు షర్మిల. ఇకపోతే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాది ఆంధ్ర అయితే.. మరి సోనియా గాంధీది ఎక్కడ..? ఆమెది ఇటలీ కదా' అని ప్రశ్నించారు. ఒక ప్రాంతాన్ని వదిలేసి.. సొంత వాళ్ళను కాదనుకొని... ఒక మహిళ పెళ్లి చేసుకున్నందుకు .. బిడ్డలను కనీ తనని తానే అంకితం చేస్తుంది మహిళ అని అన్నారు. ఇది మన దేశ సంస్కృతి, గొప్పతనమని, ఇంత గొప్ప సంస్కృతిని అర్థం చేసుకోవాలనుకుంటే సంస్కారం ఉండాలని, ఇంతటి సంస్కారం రేవంత్ రెడ్డికి లేదన్నారు. రేవంత్ రెడ్డి అభద్రతగా ఫీల్ అవుతున్నారని, తన వల్ల ఆయన ఉనికి



ఎక్కడ పోతుందో అని భయంగా ఉందని, అందుకే రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారని షర్మిల అన్నారు. తెలంగాణలో ఉన్న ఏకైక ప్రాంతీయ పార్టీ.. ప్రజా సమస్యల గురించి మాట్లాడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌టీపీ అని అన్నారు. జై తెలంగాణ అనే హక్కు రేవంత్ రెడ్డి, కేసీఅర్ , మోదీ



సోనియా లకు లేదన్నారు. రేవంత్ రెడ్డి అల్లుడు కూడా ఆంధ్రా అని.. ముందు ఆ సంగతి ఏంటో రేవంత్ రెడ్డి చూడాలని షర్మిల వ్యాఖ్యానించారు.

# రైతు సంక్షేమ కార్యక్రమాల్లో నంబర్ వన్

### నిరంతర కరెంట్‌తో అన్నపూర్ణ

### నీటి సరఫరాలతో కోనసీమగా పల్లెలు

**సిద్దిపేట,మే24(ప్రజా మంటలు):** రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. రైతులు కెసిఆర్‌ను నమ్మారని అన్నారు. కెసిఆర్ కూడా వారి సంక్షేమం విషయంలో రాజీ పడలేదన్నారు. 24గంటల కరెంట్, పెట్టుబడి, బీమా అన్నవి దేశంలో ఎక్కడా లేవన్నారు. కేసీఆర్ రాష్ట్ర సాధనకు చేసిన కృషి, స్ఫూర్తి, పట్టుదలను ప్రజలు మర్చిపోవద్దన్నారు. మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి కేసీఆర్ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో గుర్తించి ఆదరిం చారని వెల్లడించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి పాలనలో కరెంటు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఊళ్లల్లో సింగిల్‌ఫేస్ కరెంటే ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. పెళ్లో, చావో ఏదైె నా కార్యం ఉంటే కరెంట్ లైన్‌మెన్ల నుంచి ఏఈలు, డీఈల దాకా బతిమిలాడాల్సి వచ్చేది. కరెంటు లేక



ఇళ్లల్లో వ్యక్తిగత అవసరాలకు నీరు లేక నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇక త్రీఫేస్ కరెంట్ గురించి చెప్పనలవి కాదు. ఏ అర్ధరాత్రో, అపరాత్రో వచ్చేది. కరెంట్ వచ్చే సమయాన్ని చూసుకుంటూ రైతు నిద్రలేక పడిగాపులు కాయాల్సి వచ్చేది. దీంతో రైతులు అర్ధరాత్రులు పొలంబాట పట్టి విద్యుత్‌షాక్‌తో, విషపురుగుల బారిన పడి తనువు చాలించాల్సి వచ్చేది. స్వరాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను రైతులకు అందిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదిని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఇప్పుడు ప్రజల అభివృద్ధే ముఖ్యమని కెసిఆర్ నిరూపించారని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని, గోదావరిలో వృథాగా వెళ్లే జలాలను బీడు భూ ములకు మళ్లించాలనే సంకల్పం గొప్పదన్నారు. కాళేశ్వరం నుంచి గంగ పారుతున్న దృశ్యాలు ఇక్కడి రైతాంగానికి తీపి కబురని అన్నారు. ఈ ప్రాజెక్టు భావితరాలకు మేలు చేయడమే గాకుండా అన్నదాతలకు ఇక నీటి భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేయడంలో టీం వర్క్ చేశారని పేర్కొంది. ప్రజల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కారానికి కృషి చేయడాన్నిఅభినందించారు. రైతులకు 24 గంటలు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్న ఘనత దేశంలో సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదని అన్నారు. రైతును రాజును చేయడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నేడు గజ్వేల్ నియోజకవర్గం మరో కోనసీమగా మారి విపరీతంగా ధాన్యం ఉత్పత్తి అయ్యిందన్నారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష : నిధుల విడుదలలో నిర్లక్ష్యం

### ఆందోళన చేసినా గుర్తించరా?: మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్,మే24(ప్రజా మంటలు):** కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై స్పష్టమైన హామీని ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై తమ పోరాటం కొనసాగుతుందని బిఆర్ఎస్ నేతలు అన్నారు. ధాన్యం సేకరణపై పార్లమెంట్ వేదికగా పోరాడినా కేంద్రంలో చలనం కానరాలేదని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. అందుకే సిఎం కెసిఆర్ ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వమే చేపట్టేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. మూడు వేలకోట్ల అదనపుభారం మోసతూ ప్రభుత్వం ధాన్యం సేకరణ చేపట్టిందన్నారు. కేంద్రం తీరుతో అనేక రాష్ట్రాలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇటీవల అమిత్ షా నిధుల విడుదలలో ఏదో నకార్యం చేసినట్లుగా చెప్పారని మండిపడ్డారు. జిఎస్టీ ద్వారా వచ్చే నిధులను కూడా లెక్కచూపడం దారుణమన్నారు. రాజ్యాంగం మేరకు నిధుల విడుదల వస్తోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ




పట్టించడం తగదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. జీఎస్టీ బకాయిలు సహా రాష్ట్రానికి రావాల్సిన నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. తమ ఎంపిలు పార్లమెంట్ వేదికగా ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. కావాలనే తెలంగాణపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇప్పటికైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీతి ఆయోగ్ కింద మిషన్ భగీరథకు కేటాయించిన నిధుల విడుదలలో జాప్యం చేయడం సరికాదన్నారు. ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని ఎంపీ నామా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు. తెలంగాణకు రావాల్సిన జీఎస్టీ బకాయిలు, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇతర నిధులన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని మంత్రి డిమాండ్ చేశారు.

# బంగారు తెలంగాణ సాకారం అవుతోంది

### బిజెపి నేతల విమర్శలతో ఒరిగేదేమీ లేదు : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్,మే24(ప్రజా మంటలు):** అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ నిదర్శనమని, గత తెలంగాణకు నేటి తెలంగాణకు అభివృద్ధిలో స్పష్టమైన తేడాను గమనించాలని మంత్రి వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. 60 ఏండ్లలో టీడీపీ, కాంగ్రెస్ చేయలేని పనులను కెసిఆర్ తొమ్మిద్లలో చేసి చూపారని గుర్తు చేశారు. తెలంగాణ పథకాలు అభివృద్ధికి బాటలు వేస్తే..బిజెపి పథకాలు దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీసాయని అన్నారు. బంగారు తెలంగాణ అంటే రాష్ట్రంలో ఉన్న ప్రజలందరిని ఆర్థికంగా ఎదుగేందకు సంక్షేమ పథకాలు తీసుకువచ్చి అన్ని కులాల వారి కులకృత్తులను ప్రోత్సహిస్తు న్నారనీ అన్నారు. అన్ని కులాల వారు ఆర్థికంగా ఎదిగేనప్పుడే పోరాడి సాధించుకున్న తెలంగాణ బంగారు తెలంగాణగా మారుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నియోజవర్గంలో అర్హులైన ప్రతి పేదవారికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని హామీ ఇచ్చారు. గత పాలకులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించకుండానే బిల్లులు తీసుకున్నారని అన్నారు. బిజెపి రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి చేయదని అన్నారు. ప్రతిపనిపై దూరదృష్టితో ఆలోచించి నియోజక వర్గంలో ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సంక్షేమంలో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. 60ఏళ్ల ఉమ్మడి పాలనకి, టీఆర్ఎస్ పాలనలో ఉన్న వ్యత్యాసం ఏమిటో ప్రజలకు చూపించామని మంత్రి తెలిపారు. తనను గ్రామగ్రామాన ప్రజలు అత్యంత ప్రేమగా ఆహ్వానిస్తున్నారని చెప్పారు. సిఎం కెసిఆర్ కష్టపడుతున్నారు కనుకనే టీఆర్ఎస్ పార్టీతోనే బంగారు




తెలంగాణ సాధ్యమని ఘంటాపథంగా చెప్పగులుగుతున్నామని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ అన్ని కులాల అభివృద్ధికి పలు పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలు చూసి వాటిలో భాగస్వామ్యం కావాలనే అనేకులు బిఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. అల్లాటప్పాగా వచ్చి చేరడం లేదన్నారు. జనం మెచ్చిన పాలన చూసి వివిధ పార్టీలు, కుల సంఘాలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిచింద న్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో వారికి లబ్ధి చేకూరిందని వేముల వివరించారు. ప్రజామోదం పొందిన కేసీఆర్ పాలనను చూసి నియోజకవర్గంలో అనేక మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఎస్‌లో చేరడం శుభ సూచకమన్నారు.

వారంతా ఇంటి పార్టీ అని భావించి చేరుతున్నారని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన పథకాలు పూర్తి స్థాయిలో అమలు జరిగి సంక్షేమ ఫలాలు దక్కాలంటే టిఆర్ఎస్ పాలన కొనసాగలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి కేసీఆర్ అన్ని వర్గాలను ఆర్థికపథంలో నడిపించాలన్న ఉద్దేశంతో సరికొత్త పథకాలను ప్రవేశపెడుతూ అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలను, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి పక్క రాష్ట్రాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు.

# పెరిగిన ధాన్యం దిగుబడులు : మద్దతు ధరలకు కొనుగోళ్లు

**భద్రాద్రి కొత్తగూడెం,మే24(ప్రజా మంటలు):** గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగా పెరిగిందని అధికారులు అంటున్నారు. దీనికి తోడు ధాన్యం మద్దతు ధర కూడా పెరిగినందున రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరిపే అవకాశాలు ఉన్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అన్ని సౌర్యాలు కల్పించారు. ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతుధర ఇచ్చిన కొను గోలు చేస్తోంది. అంచనాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



జీసీసీ,ఐకేపీ, కోపరేటివ్ సొసైటీల ద్వారా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అందుబాటులోకి గన్నీ బ్యాగ్‌లను కూడా ఉంచారు. రైతులు విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యానికి వెంటనే పేమెంట్లు చేసేవిధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అన్నారు. రెండు లక్షల 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణ యించారు. ఇంకా కొన్ని ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టుల కింద వరి కోతలు జరగనందున చాలా ధాన్యం పొలాల్లోనే ఉండిపోయింది.

# వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

### అందుబాటులో అందరికీ ఆధుని వైద్యం

### విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

**నల్లగొండ,మే24 (ప్రజా మంటలు):** రాష్ట్రంలోని వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని



రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కొనియాడారు. అందరికీ ఆధునిక వైద్యం అందుబాటులో ఉంచాలన్నదే కేసీఆర్ సంకల్పమని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గం లోని మునగాల మండల కేంద్రంలో రూ.1.56 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంత్రి జగదీశ్ రెడ్డి బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ నిర్ణయించాలని తెలిపారు. అందులో భాగంగానే పల్లె నుంచి పట్నం దాకా ప్రజలందరికీ వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు వీలుగా ఎక్కడికక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆసుత్రుల్లో వైద్యం అంటేనే చీదరించుకునే స్థాయి నుంచి వైద్య సేవలు అంటే సర్కార్ ఆసుపత్రిలోనే అనే స్థాయికి చేర్చిన నేత ముఖ్యమంత్రి కేసీఅర్ అని ఆయన కొనియాడారు.

# కాంగ్రెస్‌కు అనుకూలంగా పరిస్థితులు

### దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు

### కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ విమర్శ

**కామారెడ్డి,మే24(ప్రజా మంటలు):** దేశంలో పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతున్నాయని, కర్నాటక ఫలితాలు త్వరలో జరిగే రాష్ట్రాల్లోనూ వస్తాయని మాజీమంత్రి,కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ



అన్నారు.ప్రజలు మోడీ పాలనతో విసిగి పోయారని ఆయన అన్నారు. ఈ విషయం గుర్తించి సరిదిద్దుకోవడంలో బిజెపి నేతలు సిద్ధంగా లేరని అన్నారు. ప్రధాని మోదీ విజన్‌లో దేశ ప్రజలు అందరూ ఉండరని.. కొంతమంది మాత్రమే ఆయన దృష్టిలో ఉంటారని, వారి ప్రయోజనాలను మాత్రమే పరిగణిస్తారని కాంగ్రెస్ నేత ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అణచివేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. భారత్ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను ధ్వంసం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను ఎత్తిచూసే సంస్థలను క్రమంగా అణచివేసే దిశగా ప్రయత్నాలు జరుగు తున్నాయని ఆరోపించారు. పార్లమెంట్, ఎన్నికలు, ప్రజాస్వామ్యం మొదలైన వ్యవస్థలపై దాడులు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ విజన్‌లో కేవలం కొంతమంది మాత్రమే ఉంటారు. ఈ వైఖరిని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. హిందూ జాతీయవాదం అనే పదాన్ని కూడా అంగీకరించను. దాడులు, హత్యలకు పాల్పడే వారి సిద్ధాంతాలను హిందుత్వంతో పోల్చడం సరికాదని షబ్బీర్ అభిప్రాయపడ్డారు.

# ఎమర్జెన్సీ లైట్‌లో బంగారం

### ఎయిర్‌పోర్టులో పట్టుకున్న కస్టమ్స్ అధికారులు

**హైదరాబాద్,మే24(ప్రజా మంటలు):** స్మగ్లర్లు కొత్తకొత్త దారుల్లో బంగా రాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కొత్త లోచనలతో యథేచ్ఛగా బంగారం స్మగ్లింగ్ చేస్తున్నారు. అనేక మార్గాల్లో విదేశాల నుండి హైదరాబాద్ కు బంగారాన్ని తీసుకొస్తూ అడ్డంగా దొరికిపోతున్నారు. తాజాగా మరోసారి కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో భారీగా బంగారం పట్టుబడింది. రూ.1.81 కోట్ల విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేయడంతో బండారం మొత్తం బయటపడింది. ప్రయాణికుడి వద్ద ఉన్న ఎమర్జెన్సీ లైట్‌లో దాచి తీసుకొచ్చిన బంగారాన్ని తనిఖీల్లో అధికారులు గుర్తించారు. ప్రయాణికుడి నుంచి దాదాపు రూ.1.82 కోట్లు విలువైన 2 వేల 915 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు.. రియాద్ నుండి హైదరాబాద్ కు వచ్చిన ముగ్గురు వ్యక్తుల నుండి భారీ మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం విలువ రూ.1.13 కోట్ల ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఆ బంగారాన్ని ఎక్కడి నుండి ఎక్కడికి తరలిస్తున్నారు, దాని వెనక ఎవరు ఉన్నారు అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి అండ

### దగ్గరుండి ఆస్పత్రికి తరలించిన మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్,మే24(ప్రజా మంటలు):** రోడ్డు ప్రమాదంలో గాయపడి హాహా కారాలు చేస్తున్న క్షతగాత్రులను మంత్రి ఎర్రబెల్లి పరామర్శించడమేగాక ఆసుపత్రికి తరలించి దగ్గరుండి వైద్యం చేయించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం ఊకల్ శివారులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్‌ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అటుగా వెళు న్నారు. మార్గమధ్యలో అప్పటికే రోడ్డు ప్రమాదానికి గురై, గాయపడిన



యువకులు రోడ్డుపై విలపిస్తుండగా మంత్రి ఘటన స్థలం వద్ద ఆగి వివరాలు తెలుసుకుని స్వయంగా తొర్రూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకెళ్లారు. గాయపడిన యువకులకు దగ్గరుండి వైద్యం చేయించారు. వారికి అయ్యే ఖర్చులను తాను భరిస్తానని భరోసా ఇచ్చారు. గాయపడిన 13 మంది యువకుల్లో కేవలం నలుగురు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారికి కూడా ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు తెలిపారు. మిగతా యువకులకు స్వల్పగాయాలు కావడంతో వారిని ప్రాథమిక చికిత్స చేయించి, ఇళ్లకు పంపించారు.



# 5 లక్షల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

**జనగామ మే 24 (ప్రజామంటలు):** పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసి ఆర్థిక చేయూత అందిస్తుందని జనగామ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జనగామ పట్టణం ధర్మకంచ కు చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు గోల్కొండ సంపత్ భార్య మాధవి అనారోగ్యానికి గురై రెండు కిడ్నీలు పాడై హైద్రాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మాధవికి కిడ్నీలు పూర్తిగా పనిచేయక పోవడం చేత ఆపరేషన్ కోసం డబ్బులు లేని విషయాన్ని మున్సిపల్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పానుగంటి ప్రవీణ్ ద్వారా తెలుసుకున్న ముత్తిరెడ్డి స్వయంగా సీఎం కేసీఆర్ తో మాట్లాడి 5 లక్షల రూపాయలు ఎల్ఓసి రూపంలో ప్రొసీడింగ్స్ ను గోల్కొండ సంపత్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మిద్దెపాక లెనిన్, సీసా రాజు, మున్సిపల్ వర్కర్స్ ఔట్సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు మునిగే కరుణాకర్, కార్యదర్శి తిప్పారపు కళ్యాణ్, యూనియన్ నాయకులు బొట్ల నర్సింగరావు, మిద్దెపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సి ఉపకులాల హక్కులకై పోరాడుదాం

## విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో హక్కులను సాధించుకొందాం

### ఎస్సి ఉపకులాల హక్కుల పోరాట సమితి

**జగిత్యాల మే 24 (ప్రజా మంటలు):** ఎస్సి 57 ఉపకులాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని కోల్పోతున్న హక్కులను సాధించుకోవ డానికి అందరూ ఏకం కావాలని ఎస్సి ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో 57 ఎస్సి ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేండ్లు అవుతున్నా ఇప్పటికి క్యాస్ట్ సర్టిఫికెట్ కు నోచుకోలేదన్నారు. ఎస్సి ఉపకులాలైన గోసంగి, మోచి, బెగరి, బుడిగజంగం, బెడ జంగం, మాలదాసరి, మాదిగ దాసరి, చిందు, హొలియ దాసరి, దక్కలి వంటి ఇతర ఉపకులాలన్నిటిని ఏకతాటిపై తెచ్చి జగిత్యాల జిల్లా కేంద్రంలో బహిరంగ సభకు నిర్వహిస్తామని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలాల వారిగా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. దళితబంధు పతకంలో అన్యాయం జరిగిందని అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఎస్సి ఉపకులాలు వెనుకబడి ఉన్నాయని రాబోయే రోజుల్లో ఐక్యతతో పోరాడి హక్కులను సాధించు కుందామని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎస్సి ఉపకులల్లోని మేధావులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కులస్తులు తమ పేర్లను 93478 37932, 70750 71928 నెంబర్లలో సంప్రదించి నమోదు చేసుకోవాలని మల్యాల శ్రీనివాస్ కోరారు.



పాలకుర్తి మండలం బమ్మెర గ్రామ కమ్యూనిస్టు సీనియర్ నాయకులు గొట్టిపర్తి ఎల్లయ్యకు స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మాన్యపు భుజేందర్, దివ్యాంగుల పాలకుర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మంద ఎల్లయ్య, యాదగిరి మిట్టపల్లి వీరభద్రయ్య, సాని ఉపేందర్, కొంగ సురేష్




# నదీమ్ జావేద్‌కు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్ లో మైనారిటీ రాష్ట్ర నాయకులు ఏపిసిట నదీమ్ జావేద్, ఎంఎల్సి టి. జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సదర్భంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా స్వాగతం పలుకుతూ శాలువాతో సత్కరించారు. నదిమ్ జావేద్ పత్రిక సమావేశం ముగిసిన తర్వాత, ఎన్ఆర్ఐ టిపిసిసి కన్వీనర్ చాంద్ పాషా ఎన్ఆర్ఐ సబ్జెక్ట్ మీద రాహుల్ గాంధీ తో చర్చించి, ఎన్ఆర్ఐ డిక్లరేషన్ పాలసీని అమలు చేసి, డిక్లరేషన్ యావత్ భారతదశంలో ఆమోదించాలని చూచించారు. వారు సానుకూలంగా స్పందించి రాహుల్ గాంధీ వారితో మాట్లాడి మళ్ళీ వచ్చినపుడు ఎంఎల్సి టి. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రకటన చేద్దాం అని ఎన్ఆర్ఐ టిపిసిసి



కన్వీనర్ చాంద్ పాషా కి చెప్పారు. అనంతరం ఎన్ఆర్ఐ మ్యానిఫెస్టో రిపోర్ట్ 150 పేజీల నివేదికను అందజేశారు. ఎన్ఆర్ఐ కోర్టు, ఎన్ఆర్ఐ హై కమిషన్, ఎన్ఆర్ఐ పోలీస్, ఎన్ఆర్ఐ హెల్ప్ లైన్ సెంటర్, ప్రతి జిల్లాకు ఆమోదించాలని కోరుతూ ఈ రిపోర్ట్ ఎన్ఆర్ఐ విక్టిమ్స్ కి ఆసరాగా నిలుస్తుంది అని, ఎన్ఆర్ఐ టిపిసిసి కన్వీనర్ చంద్ పాషా కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మన్ కుమార్, యూత్ ప్రెసిడెంట్ మధు, పొలాస నందయ్య, కౌన్సిలర్ దుర్గయ్య, మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ నిహాల్, కౌన్సిలర్ హజర్, కౌన్సిలర్ కమల్, హబిబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

# జగిత్యాల జిల్లాలో ఘనంగా నిర్వహించాలి

## దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ యాక్షన్ ప్లాన్

### కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత సముదాయాల భవనంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, మంద మకరంద, ఎస్పి భాస్కర్ తో కలిసి తెలంగాణ రాష్ట్ర ఆవరణ దినోత్సవ సందర్భంగా జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉదయం 8 గంటల వరకు కార్యాలయాలలో పతాకావిష్కరణ ముగించుకుని రావాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీలలో సర్పంచులు, మున్సిపాలిటిలో చైర్మన్లు పతాకావిష్కరణ చేయాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రగతి నివేదికను సందేశం రూపంలో తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని మరియు అందుకు సంబంధించిన అంశాలు డ్రాఫ్ట్ రూపంలో ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. అలాగే దీనిలో మార్పులు చేర్పులు కూడా జరగవచ్చని అధికారులు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రైతు బంధుకు సంబంధించి క్లస్టర్ లో అధికారులు రైతులను భాగస్వామ్యులను చేయాలని, ఇందుకోసం ఎన్ని



పాంప్లేట్లు, ఫ్లెక్సీలు పెద్దవి, చిన్నవి ఎన్ని అవసరం అక్కడి అధికారులు రైతు సంఘాల కమిటి సభ్యులు కో-ఆర్డినేట్ చేసుకోవాలని ఆదేశించారు. ముందుగా ఉన్న 71 రైతు వేదికలను, వాటి ప్రాంగణాలను శుభ్రంగా చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. పాడైపోయినా, చిన్న చిన్న రిపేర్లు ఉన్న రైతు వేదికలను వెంటనే బాగు చేయించాలని వాటికీ తోరణాలు, లైటింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. మరియు రైతు భీమా పొందిన వారిని పిలిపించి వారితో కార్యక్రమంలో మాట్లాడించే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మైక్ సిస్టం, సీటింగ్ అరెంట్ మెంట్స్ అలాగే సాముహిక భోజనాలు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో భాగస్వాములై విజయవంతంగా పూర్తీ చేయాలని కలెక్టర్ కోరారు. అధికారులు తమ శాఖ ద్వారా చేయవలసిన కార్యక్రమాలను తప్పకుండా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుండి 22 వరకు:

జూన్ 2న ప్రారంభోత్సవం, జూన్ 3 న తెలంగాణ రైతు దినోత్సవం, జూన్ 4 ఆదివారం: సురక్షా దినోత్సవం (రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి కార్యక్రమాలు), జూన్ 5 సోమవారం తెలంగాణ విద్యుత్ విజయోత్సవం, జూన్ 6 న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7 న సాగునీటి దినోత్సవం, 8 న ఊరూరా చెరువుల పండుగ, 9 న తెలంగాణ సంక్షేమ సంబురాలు, 10 న శనివారం తెలంగాణ సుపరిపాలన దినోత్సవం (పరిపాలన సంస్కరణలు, ఫలితాలు), 11 ఆదివారం : తెలంగాణ సాహిత్య దినోత్సవం. ( రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో కవి సమ్మేళనాలు), 12 న తెలంగాణ రన్, 13 న తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం, 14 న తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం, 15 న తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం, 16 న తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజనోత్సవం, 18 న తెలంగాణ మంచి నీళ్ళ పండుగ, 19 న తెలంగాణ హరితోత్సవం, 20 న మంగళవారం తెలంగాణ విద్యాదినోత్సవం, 21 న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం, జూన్ 22 గురువారం అమరుల సంస్మరణ. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, మంద మకరంద, ఎస్పి భాస్కర్, ఆర్డిఓలు వినోద్ కుమార్, మాధవి, జిల్లా అధికారులు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది, తదితరల పాల్గొన్నారు.

# 9 సంవత్సరాల బిజెపి విజయాల పుస్తకావిష్కరణ

**వేములవాడ మే 24 (ప్రజామంటలు):** మన దేశం చాలా గొప్పది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. కష్టపడే తత్వం, సేవ చేయాలనే సంకల్పం, పోరాట పటిమ, నాయకత్వ లక్షణాలుంటే చాలు... పేద, ధనిక అనే తేడా లేకుండా భారత ప్రధానమంత్రి కాగలరని నిరూపించి భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి నరేంద్ర మోదీ.

ఛాయ్ అమ్ముకునే మోదీ ఆర్ఎస్ఎస్ లో చేరి దేశం కోసం, ధర్మం కోసం పాటుపడ్డారు. బీజేపీలో చేరి పార్టీ ఎదుగదల కోసం నిరంతరం శ్రమించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం ఎల్ కే అద్వానీ చేపట్టిన రామ్ రథ యాత్ర విజయవంతానికి, కన్యా కుమారి నుండి కాశ్మీర్ వరకు మురళీ మనోహర్ జోషి చేపట్టి ఏక్తా రథయాత్రకు ఇంఛార్జీ పూర్తి సహాయ సహకారాలు అందించారు. గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు.

బీజేపీ ఎంత గొప్ప పార్టీ అంటే... సిద్ధాంతాలను నమ్ముకుని కష్టపడి ప్రజలకు సేవ చేయాలనుకునే వారిని గుర్తించి గౌరవించే ఏకైక పార్టీ. అందుకే మోదీగారు పార్టీ కోసం, ప్రజల కోసం, ధర్మం కోసం చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్యే కానప్పటికీ పార్టీ శాసనసభ్యుల ఆమోదంతో మోదీని 2001 అక్టోబర్ 7న ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. బీజేపీ నమ్మకాన్ని వమ్ముచేయని మోదీ అభివృద్ధిలో గుజరాత్ ను దేశానికే మోడల్ గా తీర్చిదిద్దారు. తిరుగులేని విజయాలను



సాధించి 12 ఏళ్ల 227 రోజులపాటు సీఎంగా కొనసాగారు. మోదీ సేవలు దేశానికి అవసరమని గుర్తించిన బీజేపీ 2014లో తొలిసారి ఎంపీగా ఎన్నికైన వెంటనే ఎంపీల ఆమోదంతో ప్రధానమంత్రిని చేసిందన్నారు. ప్రధానమంత్రిగా, అంతకు ముందు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి గత అక్టోబర్ 7 నాటికి 20 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా మోదీ 20 ఏళ్లలో సాధించిన విజయాలు, దేశం సాధించిన ప్రగతి ఏ విధంగా ఉందనే విషయాన్ని ఈ పుస్తకంలో వెల్లడించారు. అందుకే ఈ పుస్తకాన్ని మీ చేతుల్లో పెడుతున్నా... మీరు చదివండి... అందులోని విషయాలను పది మందికి తెలియజేయండి. నా పార్లమెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని లైబ్రరీల్లో ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నా. చదవాలనే ఆసక్తి ఉన్న వాళ్లకు లైబ్రరీలో అందుబాటులో ఉంచుతాం... ఈ పుస్తకాన్ని చదివి అర్థం చేసుకుని ఈ పట్టణంలో ఏ ఒక్కరు మోదీ స్ఫూర్తితో పనిచేసినా సరే... ఈ పుస్తకం లక్ష్యం నెరవేరినట్లే.

# బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం

**మెట్‌పల్లి మే 24 (ప్రజామంటలు):** మెట్‌పల్లి బిజెపి పార్టీ వారి ఆధ్వర్యంలో మెట్పల్లి వాసవి గార్డెన్లో బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా ముఖ్య అతిథిగా నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొని బిజెపి పార్టీ కార్యకర్తలకు రాబోయే ఎన్నికల్లో ఎదుర్కొన్న సవరణ వివరించారు. వ్యవసాయ తీర్మాన కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి తీర్మాన కాపీని చదివి బిజెపి పార్టీ వ్యవసాయ తీర్మాన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్త కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామ గ్రామాన తీసుకువెళ్లి అవగాహన చేయాలని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన కొన్ని పథకాలను తొక్కిపెట్టిన పథకాలను వివరించాలని బిఆర్ఎస్ పార్టీ ని కేసీఆర్ ప్రభుత్వాన్ని వారు చేస్తున్న అవినీతి పాలనను ప్రజల వివరించాలని తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.... నిజామాబాద్ సిగ్నెట్లలో అన్ని నియోజక వర్గాలలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ప్రతి నియోజకవర్గంలో బిజెపి కార్యకర్తలు బలంగా ఉన్నారని టీఆర్ఎస్ ఓడించే సత్తా బిజెపికే ఉందని బిజెపి నాయకుడు ఎవరైనా సరే ప్రజల్లోకి వెళ్లి పార్టీని టికెట్లు అడగాలని ఇది ప్రధానమంత్రి చేతుల్లో ఉంటుందని టికెట్లు ఇచ్చే విషయము టికెట్టు కోరేవారు కేంద్ర ప్రభుత్వం పంపి ప్రతినిధులు ఎంపిక చేస్తారని నన్ను మీరు అందరిని వారే ఎంపిక చేస్తారని కానీ ప్రతి ఒక్కరూ కష్టపడి బిజెపి పార్టీ బలోపేతర కృషి చేయాలని అన్నారు. బిజెపి పార్టీ తీర్మానం డిమాండ్లు లక్ష రూపాయలు రుణమాఫీ వెంటనే మాఫీ చేయాలని పైసల్ ప్రధానమంత్రి పైసల్ బీమా యోజన అమలు చేయాలని రాజకీయ దురుద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేయలేదని అలాగే మామిడి, వరి, మొక్కజొన్న పంటలు నష్టపరిహారం చెల్లించాలని తేమ పేరుతో ఐదు కిలోలు కటింగ్ చేస్తున్న రైస్ మిల్ దోపిడిని అరికట్టాలని ముత్యంపేట సుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన దానిని వెంటనే తెరిపించాలని కథలాపూర్ మండలంలో సూరమ్మ ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని



డిమాండ్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబార్ ప్రభాకర్, బోగా శ్రావణి, జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, జిల్లా జనరల్ సెక్రెటరీ కారార్ల మధుకర్, రాగల సత్యనారాయణ, సురభి నవీన్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ చెట్ల పెల్లి సుఖేందర్ గౌడ్, దునికెల నవీన్, కస్తూరి సత్యం, కౌన్సిలర్ మీనా, విజయ్, గౌతమ్, రఘు, శ్రీకాంత్, గంగాధర్ తదితర బిజెపి రాష్ట్ర. జిల్లా .పట్టణ. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కెనడాలో అత్యుత్సాహంగా అన్నమయ్య ఆరాధనోత్సవాలు

**హైదరాబాద్ మే 24 (ప్రజామంటలు):** 'వీధుల వీధుల విభుడేగే' అనే అన్నమయ్య కృతిలో ఉన్నట్టు కెనడా వ్యాప్తంగా ఆరు ప్రావిన్స్ ల నుండి 108 విలక్షణమైన అన్నమయ్య కృతులతో 11 గంటల పాటు అన్నమయ్య ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. తెలుగుతల్లి కెనడా లక్ష్మి రాయవరపు వారి బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత తెలుగు సినిమా కథ, పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, శ్రీమతి యస్ పి వసంత లక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉమా సలాది దీప ప్రజ్వలన చేయగా, పాణంగిపల్లి విజయలక్ష్మి ప్రార్థన గీతం తో సభ మొదలైంది. అశోక్ తేజ మాట్లాడుతూ జీవితంలో ప్రతి సందర్భంలోనూ అతి చిన్న పదాలతో జనాలు నాల్కల మీద తిరిగే రచనలు వ్రాసిన అన్నమయ్య తన వంటి ఎందరో రచయితలకి మార్గ దర్శకులు అయ్యారని, అన్నమయ్య పుట్టిన తిథి లోనే తను కూడా పుట్టారని తెలియజేస్తూ, అన్నమయ్య గురించి చేసిన ప్రసంగంలో ఎన్నో ఆసక్తి కరమైన విషయాలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ ద్వారా తెలుగుతల్లి కెనడా భావి తరాలకు మంచి సంస్కృతి, సంస్కారాన్ని అందిస్తుందని వారు అన్నారు. తెలుగుతల్లి కెనడా తరఫున వారి భార్య నిర్మలచేతుల మీదుగా సత్కారం పొందడం చాలా ఆనందం కలగజేసింది. యస్పీ వసంత లక్ష్మి మాట్లాడుతూ ఎప్పుడు విదేశాలకి ప్రయాణం చెయ్యలేదని, ఈనాడు కెనడా వచ్చిన అనుభూతి కలిగిందని చెప్పారు. చక్కని ఆత్మీయమైన మాటలతో, పాటతో వారు అందరినీ అలరింప జేసారు. తెలుగుతల్లి కెనడా లక్ష్మి రాయవరపు గొప్ప జాతీయవాది.




తెలుగు జాతి అభిమాని. లక్ష్మి మాట్లాడుతూ మన తెలుగు భాషలో ఎన్నో గొప్ప భక్తి గీతాలు, మహాభారతం, రామాయణం, భాగవతం ఎన్నో ఉన్నాయి. అన్నమయ్యకు పదకవితా పితా మహుడు అని బిరుదు ఉందని, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని, అహోబిలం లోని నరసింహ స్వామిని కీర్తిస్తూ 32 వేలకు పైగా కీర్తనలు రచించారని తెలిపారు. తెలుగు భాషకి అత్యున్నత వైభవం అన్నమయ్య కృతులు దేశ విదేశాలకు పరి చయం చేయాలనే సంకల్పం. తెలుగుతల్లి కెనడా సంస్థకు సహక రిస్తున్న పత్రిక కమిటీని, వివాహ వేదిక కమిటీని, యూట్యూబ్ కమిటీని, పిల్లల మాసపత్రిక గడుగ్గాయి కమిటీని పరిచయం చేస్తూ తెలుగుతల్లి కెనడా లక్ష్మి రాయవరపు ప్రతి సంవత్సరం ఈ వేడుకలు వివిధ ప్రదేశాలలో జరుగుతున్నప్పటికీ, దేశవ్యాప్తంగా ఒక వేదిక మీద జరగడం గత సంవత్సరం మొదలు పెట్టారు , త్యాగరాజ ఉత్సవాల్లో గుర్తింపు పొందిన ఒక సీనియర్ గాయని/ గాయకునికి జీవన సాఫల్య పురస్కారం అందించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలుగుతల్లి కెనడా నిర్వాహకులు పేర్కొన్నారు.

తెలుగుతల్లి కెనడా వెబ్ మాసపత్రిక తో పాటు ప్రతినెలా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దేశంలో ఉన్న ప్రతిభావంతులైన వారందరినీ ఒక చోట చేర్చడం తన లక్ష్యమని తెలుగుతల్లి కెనడా వ్యవస్థాపకులు లక్ష్మి రాయ వరపు తెలిపారు. అతిథులకు భాస్కర వర్మ వందన సమర్పణతో మొదటి సభ ముగిసింది.





## జిల్లా స్థాయి సీఎం కప్ - 2023

### పురుషుల, మహిళల ఖోఖోలో భీమదేవరపల్లి ప్రథమ స్థానం

**భీమదేవరపల్లి మే 24 (ప్రజామంటలు):** మండలానికి చెందిన పురుషుల, మహిళల ఖో - ఖో జట్టు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటికే జిల్లా స్థాయిలో వివిధ క్రీడలలో ప్రథమ స్థానాల్లో ఉన్న భీమ దేవరపల్లి మండల క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నిక కావడం పట్ల ఎంపీపీ జక్కుల అనిత రమేష్ యాదవ్, ఎంపీడీవో లంకపల్లి భాస్కర్ క్రీడాకారులను అభినందించారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన అధికారులు, నాయకులు

**సికింద్రాబాద్ మే 24 (ప్రజామంటలు):** బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్, కృష్ణానగర్ ల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం జీహెచ్ఎమ్సీ అధికారులతో కలసి స్థానిక డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. యాక్సిస్ బ్యాంకు, ఎల్.ఐ.సీ నుంచి కృష్ణానగర్, భోలక్



పూర్ స్లమ్ వరకు వెళ్ళే దారిలో సీసీ రోడ్డు పనులను రూ కోటి20 లక్షలతో చేస్తుండగా, అక్కడక్కడ రోడ్డు పనుల్లో భాగంగా ఇండ్ల ముందు జేసీబీతో చదును చేస్తుండగా, డ్రైనేజీ, వాటర్ లైన్లు దెబ్బతిన్నాయని, వాటిని బాగు చేస్తామని అధికారులు తెలిపారు. రోడ్లను సీసీ రోడ్డుగా మార్చిన మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఏసూరి మహేశ్ లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి చొరవతో త్వరలో డివిజన్ లోని చిన్న గల్లీలు, స్లమ్ లల్లో కూడ సీసీ రోడ్లను వేస్తామని సీనియర్ నాయకులు ఏసూరి మహేశ్, ఎం.ఆర్.రాంబాబు, మ్యాదరి గురుమూర్తి, మహిళా నేతలు విజయనిర్మల, లక్ష్మీ లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎమ్సీ డిప్యూటీ ఇంజనీయర్ ఆంజనేయులు, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్

### తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్

**హనుమకొండ మే 24 (ప్రజామంటలు):** హసన్ పర్తి వద్ద బల్దియా నిర్వహిస్తున్న కుక్కల శస్త్ర చికిత్స కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్ లో కొనసాగుతున్న కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ తీరును కమిషనర్ పరిశీలించారు. వీధి కుక్కల



బెడదను నియంత్రించడానికి ప్రతీ రోజు కనీసం 30 కుక్కలకు సంతానం కలుగకుండ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని కోరారు. మరిన్ని శస్త్ర చికిత్సలను పెంచుటకు చర్యలు చేపట్టాలని, దీని వల్ల నిర్దిష్ట సమయంలోనే వీధి కుక్కల పుట్టుకను తక్కువ సమయంలోనే నియంత్రించవచ్చని అన్నారు. ఆయా ప్రభావిత ప్రాంతాల్లో ప్రణాళిక బద్ధంగా కుక్కలను పట్టాలని అన్నారు. ఈ సందర్భంగా బోనులో గల కుక్కలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కమిషనర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, వెటర్నరీ డాక్టర్ గోపాల్ రావు, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కేసిఆర్, వైద్య ఆరోగ్య మంత్రి హరీష్ రావులకు జగిత్యాల జిల్లా ప్రజల పక్షాన ఎమ్మెల్యే ధన్యవాదాలు

**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** మెడికల్ కాలేజీ కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 33 విభాగాల్లో 42 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ లను నియమించగా జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



కుమార్ మీడియా ముఖంగా ముఖ్యమంత్రి కేసిఆర్, వైద్య ఆరోగ్య మంత్రి హరీష్ రావు లకు జిల్లా ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, సీనియర్ నాయకులు బాలే శంకర్, కౌన్సిలర్ వోద్ది శ్రీలత రామ్మోహన్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆరే దేశానికి శ్రీరామరక్ష

### కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలం

### ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకం కావాలి

### ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**సైదాపూర్ మే 24 (ప్రజా మంటలు):** ఆత్మీయ సమ్మేళనాలతో నాయకులు, కార్యకర్తల మధ్య అనుబంధం బలోపేతం సైదాపూర్ మండల కేంద్రంలో 50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం. వరద కాలువ కాదు జీవ కాలువ ద్వారా గోదావరి జలాలను సైదాపూర్ మండలానికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది. శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్. విఎస్ఆర్ గార్డెన్ లో వె-సైదాపూర్ మండలంలోని 13 గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం-2 లో పాల్గొన్న కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు సోమారపు రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ.... హుస్నాబాద్ నియోజకవర్గంలో సైదాపూర్ మండలం అన్నీ రంగాల్లో అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుంది, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకతతో అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మిడ్ మానేరు కుడి కాలువ ద్వారా గోదావరి జలాలతో సైదాపూర్ మండలం సస్యశ్యామలం చేసిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికే దక్కుతుంది, మొలంగూర్ నుండి హైదరాబాద్ వెళ్ళు డబుల్ రోడ్ నిర్మాణం,ప్రతి గ్రామాల్లో సీసీ రోడ్లు, మిషన్ భగీరథతో ఇంటి ఇంటికి నీరు అందిచడం జరుగుతుంది అని తెలిపారు.తెలంగాణ ఉద్యమం సమయంలో పోరాట స్ఫూర్తి నింపిన మండలం సైదాపూర్ అని గుర్తు చేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీకి కార్యకర్తలే శ్రీరామ రక్ష అని ఆత్మీయ సమ్మేళనాలు నాయకులు, కార్యకర్తల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని బలోపేతం చేస్తాయన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపి మరింత చైతన్య పరిచేందుకు పార్టీ అధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ కు హ్యాట్రిక్ విజయం. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకం కావాలి అని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయనుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా కేవలం కులం, మతం పేరిట ప్రతిపక్షాలు చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.రోజు రోజుకు శ్రుతి మించుతున్న బిజెపి దుర్మార్గాలను ఎండ గట్టి ఎక్కడి కక్కడ బీఆర్ఎస్ శ్రేణులు తిప్పి కొట్టాలి అని పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరూ సిద్ధం కావాలని, ఎప్పటికప్పుడు ప్రజలతో మమైకం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, కేజీ నుండి పీజీ ఉచిత విద్య, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి లాంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. శరవేగంగా విస్తరిస్తున్న హుస్నాబాద్ నియోజక వర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకతతో అందిస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లాలో 2 లక్షల 50 వేల పార్టీ సభ్యత్వం కలిగి రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల సభ్యత్వాలు ఉన్న ఏకైక పార్టీ మన బీఆర్ఎస్ పార్టీ మన కార్యకర్తల సంక్షేమం విషయంలో బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అగ్ర భాగాన ఉంటుందని తెలిపారు. ప్రతి కార్యకర్తకు రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా అందించడంతో పాటు ఆపదలో అండగా ఉంటున్నామని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళు న్నామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేరవేసి మూడోసారి హ్యాట్రిక్ విజయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని అందుకు కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జి.వి రామకృష్ణ రావు, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్షణ్ రావు, ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సోమారపు రాజయ్య, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చంద్ర శ్రీనివాస్, సర్పంచుల కార్యదర్శ రాములు, పద్మజ, పద్మ, కొమురయ్య, సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతి రెడ్డి, బిర్లా వెంకట్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు ముత్యాల వీరారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విఆర్ఏల క్రమబద్ధీకరణలో వారసుల గందరగోళం

### వంతుల వారిగా సేవలు అందిస్తున్న గ్రామ సేవకులు

### రికార్డులలో ఉన్న పేరు ఆధారంగానే ఎంపిక

### వంతులతో సంబంధం లేదు

**భీమదేవరపల్లి మే 24 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఏల క్రమబద్ధీకరణకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ సేవకులు వారి వారసుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. గత కొన్నేళ్లుగా నీరటిలు, సుంకరులు, గ్రామ సేవలు పనిచేస్తున్న వారు ప్రస్తుతం విఆర్ఏలుగా కొనసాగుతున్నారు. రెండు మూడు తరాలు ఈ వృత్తిలో సేవలందించి కొందరు గ్రామ సేవకులు చనిపోగా వారి వారసులలో ఒకరు విఆర్ఏగా పనిచేస్తున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విఆర్ఏ వారసుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో గందరగోళం ఏర్పడింది. బుధవారం మీడియాతో గ్రామానికి చెందిన కొందరు గ్రామసేవకులు మాట్లాడుతూ వృత్తిలో వారసులుగా సేవలు చేస్తున్నామని తమను గుర్తించాలని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వంగా వచ్చిన వృత్తిలో తాము వారసులుగా ఉన్నామని తమను గుర్తించాలని వేడుకుంటున్నారు. కుటుంబ పెద్ద వారి పేరుపై వస్తున్న వృత్తిలో తాము కూడా వంతుల వారీగా గ్రామంలో సేవలు చేస్తున్నామని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నాగుల వీరస్వామి పేరుతో



సుంకరి, నీరటి వృత్తి వారసులుగా నాగుల పెంటయ్య, నాగుల రాజమల్లు, నాగుల లింగయ్య, నాగుల శంకర్ వంతుల వారీగా గ్రామం, రెవెన్యూ ఆఫీసులో సేవలందించినట్లు చెప్పారు. ఇదే గ్రామంలో మద్దె బిక్షపతి పేరుతో ఉన్న విఆర్ఏ వృత్తి వంతుల వారిగా మద్దె ఐలయ్య, మద్దే సారమ్మ, మద్దె సమ్మయ్య, నమ్ముల చంద్రయ్య, పందుల రాజు, నలివేరి తిరుపతి గ్రామ సేవకులుగా పనిచేసామని అన్నారు. తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

### రికార్డుల ప్రకారమే వివరాలు సేకరిస్తున్నాం: డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్

మండలంలో మొత్తం 29 మంది విఆర్ఏలు ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వ క్రమబద్ధీకరణకు ఇచ్చిన అదేశాల మేరకు విఆర్ఏల వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. విఆర్ఏ గా రికార్డులో ఎవరి పేరుతో ఉంటే వారి వివరాలు మాత్రమే సేకరిస్తున్నట్లు తెలిపారు. వంతుల వారీగా పనిచేస్తున్న వారసుల మధ్య తగదాలతో తమకు సంబంధం లేదని అన్నారు.

# గతం కంటే అధికంగా ధాన్యం కొనుగోలు చేసాం

### రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా చర్యలు

### మంత్రి గంగుల కమలాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య

**జనగామ మే 24 (ప్రజామంటలు):** జనగామ జిల్లాలో రైతులు పండించిన పంటను ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, రైస్ మిల్లర్లకు అలాట్ చేసిన ధాన్యాన్ని తప్పనిసరిగా దించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివలింగయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, పౌర సరఫరాల కమిషనర్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోలు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా పంట విస్తీర్ణం విపరీతంగా పెరిగిందని, ధాన్యం దిగుబడి బాగా పెరిగిందని, రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో జిల్లా కలెక్టర్లు, అధికారులు తీసుకున్న చర్యల కారణంగా గత సంవత్సరం కంటే అధికంగా ధాన్యం కొనుగోలు చేశామని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గత సంవత్సరంలో 4.5 లక్షల రైతుల నుంచి 28 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం మే 23 నాటికి 6.4 లక్షల రైతుల నుంచి 38 లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామని. గత సంవత్సరం కంటే అధికంగా 450 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని మంత్రి తెలిపారు.

జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్ట పోవద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలలో రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడికి స్థల సమస్య ఉందని, దీనివల్ల లారీల మూమెంట్, మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి ఆలస్యం అవుతుందని, దీనిని నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోడౌన్లో భద్రపరచాలని, జిల్లాలో మిల్లుల వద్ద స్థల సమస్య ఉంటే ప్రత్యామ్నాయ స్థలాల ఎంపిక చేపడుతామని, ప్రస్తుతానికి రైస్ మిల్లుల వద్ద అందుబాటులో ఉన్న స్థలంలో దాన్యం దిగుబడి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య,సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, జిల్లాలో దాన్యం కొనుగోలు కేంద్రాలకు అలాట్ చేసిన రైస్ మిల్లులకు తప్పనిసరిగా ధాన్యం పంపాలని, రైస్ మిల్లులలో ఉన్న స్థలంలో దాన్యం దిగుబడి చేసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ఆగకుండా ప్రతిరోజు జరిగే విధంగా



ఇంటర్మీడియట్ గోడౌన్ లను గుర్తించాలని మంత్రి ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద లోడింగ్, అన్లోడింగ్ సమస్య రాకుండా అధిక సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, జిల్లాల వారీగా అవసరమైతే లారీల సంఖ్యను పెంచాలని రైతుల వద్ద చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి తెలిపారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా అలాట్ చేసిన రైస్ మిల్లులు తప్పనిసరిగా ధాన్యం దిగుమతి చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నామని, రైస్ అధికారులు పర్యవేక్షించాలని, జిల్లాలో ఇప్పటివరకు 1, లక్ష ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఇంకా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎం. రోజా రాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రామ్ రెడ్డి , జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, అధికారి నాగేశ్వర శర్మ, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి , పెద్దమ్మ తల్లి విగ్రహాలను ప్రతిష్టాపించిన గ్రామస్తులు

**సైదాపూర్ మే 24 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంబొమ్మకల్ గ్రామంలో నూతన పోచమ్మ తల్లి విగ్రహం ప్రతిష్టాపన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన శివాలయం గజ స్థంభం సీతారాముల విగ్రహాలు ప్రతిష్టాపన చేయడం జరిగింది. అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు కుంకుమార్చన, పూజలను పూజారులు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టి ప్రత్యూష, ఎంపిటిసి ఏరుకొండ ఇందిర, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బేజాడి శ్రీచరణ్ జన్మదినం, పలు సేవా కార్యక్రమాలు

**జనగామ మే 24 (ప్రజామంటలు):** జనగామ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప కుమారుడు మాస్టర్ వరణ్ జన్మదిన శుభ సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా దావఖానాలోని నిరుపేద 80 మంది రోగులకు గిర్నిగడ్డలోని శ్రీ రాజరాజేశ్వరి



సేవా సదనంలో పాలు, పండ్లు ,బ్రెడ్, జ్యూస్ (ఓఆర్ఎస్) ప్యాకెట్లను, పవన్ కళ్యాణ్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా జోగు భాస్కర్ మాట్లాడుతూ.... జనగామ జిల్లా యువ నాయకులు బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బిరప్ప ఆలోచన విధానాల మేరకు ఈ సమాజం నాకేమిచ్చిందని కాదు ఈ సమాజానికి నేను ఏ విధంగా ఉపయోగపడతాను అనే విధానం తోటి, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం బేజాడి కుటుంబం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పీపుల్స్ హెల్పింగ్ అధ్యక్షులు జోగు భాస్కర్, దయ ఉపేందర్, సాయిరాం, రంజిత్, దిలీప్, జోగు ఉదయ్, అశోక్ పృథ్వి, మను, అజు, శంకర్ పాల్గొన్నారు.

## గాంధీలో తప్పిపోయిన బాలుడు

### తల్లికి అప్పచెప్పిన సెక్యూరిటీ గార్డులు

**సికింద్రాబాద్ మే 24 (ప్రజామంటలు):** నిత్యం వేలాది మంది పేషంట్లు, సహాయకులు, విజిటర్స్ రాకపోకలు సాగించే గాంధీ ఆసుపత్రిలో బుధవారం ఉదయం పూట ఓ రెండేళ్ళ బాలుడు తప్పిపోయాడు. పెద్దవాళ్ళు ఎవరూ లేక మార్చురీ వద్ద ఒక్కడే ఉన్న బాలుడిని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది గార్డు రూమ్ కు తీసుకొచ్చి, కూర్చుండ బెట్టి స్నాక్స్, వాటర్ అందించారు.



మధ్యాహ్నం సమయంలో బాలుడి తల్లి షేక్ గౌసియా తన కుమారుడి గురించి ఆసుపత్రిలో వెతుకుతుండగా, గమనించిన సెక్యూరిటీ సూపర్ వైజర్లు శ్రీకాంత్, ఆంజనేయులు, నాగరాజు, లావణ్యలు గార్డు రూమ్ లో బాలుడు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు. తర్వాత సెక్యూరిటీ గార్డులు శివ, రేణుక లు బాలుడిని తల్లికి అప్పగించారు. సికింద్రాబాద్ లోని గాంధీనగర్ కు చెందిన తాను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రిలోనికి వెళ్లే సమయంలో బాబు తప్పిపోయాడని పేర్కొన్న తల్లి గౌసియా, ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు కృతజ్ఞతలు చెప్పింది. గాంధీ ఆసుపత్రికి వచ్చే చిన్నారులను వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని, పిల్లలను ఒంటరిగా విడిచిపెట్టి ఎటూ వెళ్ళకూడదని జీడీఎక్స్ సెక్యూరిటీ ఇంచార్జీ రవికుమార్, శివాజీ లు విజ్ఞప్తి చేశారు.

## నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు ఉచిత శిక్షణ

**జనగామ మే 24 (ప్రజామంటలు):** వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఐటిడిఎ ఏటూరు నాగారం పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన గిరిజన యువతి, యువకులను గ్రూప్ 2,3,4 తదితర పరీక్షలకు సిద్ధం చేసేందుకు గాను రెసిడెన్సియల్ పద్ధతిలో ఉచిత కోచింగ్ ఇవ్వబడుతుందని ఐటిడిఎ ఏటూరు నాగారం ప్రాజెక్టు డైరెక్టర్ అంకిత ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు భోజన సదుపాయం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని, నోట్ పుస్తకాలు రెఫరల్ పుస్తకాలు అందించబడుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులకు మాత్రమే %ర్బ్సఎఆఇతీఎశ్రీవ. ఎ్ర్రస్త్ర. ప్త్రశీజ. ఱఅ ఎవఎంట్‌వ% ద్వారా మే 22 నుండి మే 27 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, (ఇంతకుముందు ఐటిడిఏ ఏటూరు నాగారం ద్వారా శిక్షణ తీసుకున్న అభ్యర్థులు) ఈ సదవకాశాన్ని గిరిజన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోగలరని అన్నారు. మరిన్ని వివరాలకు 0870-3500644 పని దినాలలో ఉదయం 10.30 నుండి 5:00 గంట లోపు సంప్రదించాలని అంకిత కోరారు.

# బీసీ బంధు ప్రకటించాలి : చేతి వృత్తుల కుటుంబానికి 5 లక్షలు ఇవ్వాలి

**జగిత్యాల మే 24 (ప్రజామంటలు):** బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. నల్లపోచమ్మ దేవాలయం శివాజీ నగర్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రపంచీకరణ వ్యవస్థలో చేతివృత్తులు కనుమరుగై పోతున్న తరుణంలో కుల వృత్తుల వారికి చేయూతనిచ్చి ఆదుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా కొన్ని కులాలకు మాత్రమే కొన్ని అభివృద్ధి పథకాలు అందించి మిగతా కులాలను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన పాలనలో ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయక పోవడంతో చేతి వృత్తి పనివారలు బతుకు భారమై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని వారు వాపోయారు. ఇంతకాలం బీసీల్లో కొన్ని కులాలకు మినహా చేతి వృత్తి ఆధారిత కులాలకు ఎటువంటి ఉపయుక్తమైన పథకాలు ప్రకటించకపోవడం శోచనీయమని వారున్నారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీల ఓట్లు దండుకోవడానికి తెరాస ప్రభుత్వం మరోసారి నూతన పథకాల ఆశ చూపిస్తూ మోసపూరితమైన ప్రకటనలు చేయడం సమంజసం కాదని, ఇప్పుడు కొత్తగా చేతివృత్తుల వారికి లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని కుటుంబానికి కేటాయించే లక్ష రూపాయలు ఏ కోశానా సరిపోతాయని అన్నారు. దళితబాంధవులకు ఇచ్చినట్టుగా బీసీలకు పది లక్షలతో బీసీ బందు ప్రకటించి సత్వరమే అమలు చేయాలని, చేతివృత్తుల వారికి కుటుంబానికి కనీసం ఐదు లక్షలు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్, సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, పట్టణాధ్యక్షులు రాపర్తి రవి తో పాటుగా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కోవిడ్-19 పేషంట్ కేర్ సిబ్బంది నిరాహార దీక్ష

### నీడ కోసం టెంట్ వేయడానికి నో చెప్పిన పోలీసులు

### ఎండలో తిండి తినక సిబ్బంది దీక్ష

### తమను పట్టించుకోకపోవడం ఘోరం

**సికింద్రాబాద్ మే 24 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో కరోనా పాండమిక్ లో పేషంట్ కేర్ సిబ్బందిగా నియమితులై, రెండు నెలల క్రితం విధుల్లో నుంచి తొలగించబడిన సిబ్బంది బుధవారం నుంచి నిరాహారదీక్ష చేపట్టారు. గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఎర్రని ఎండలో కనీసం నీడ లేని స్థలంలో దీక్ష చేపట్టారు. నీడ కోసం సిబ్బంది టెంట్ వేసుకోడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడంతో చేసేదేమి లేక మండుటెండలోనే నేలపై కూర్చుండి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాహారదీక్ష చేశారు. తమను అన్యాయంగా తొలగించిన ప్రభుత్వ పెద్దలకు తమ ఉసురు తగులుతుందని, ఆడవాళ్ళను ఇబ్బంది పెట్టి, వారిని హింసించిన వారు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం గాని, ఏ వ్యక్తులు గాని బాగుపడలేదని మహిళా సిబ్బంది ఆవేదన చెందారు. డ్యూటీలు పోయిన తర్వాత రెండు నెలల నుంచి తమ ఇల్లు గడవడం కష్టంగా ఉందని, తిండికి, ఇంటి అద్దెకు చాలా ఇబ్బంది అవుతుందని వారు వాపోయారు. తాము గొంతెమ్మ కోరికలు ఏమీ కోరడం లేదని, తాము చేసిన డ్యూటీలను ఇవ్వమని మాత్రమే అడుగుతున్నామన్నారు.

రెండు నెలలుగా మంత్రులను, అధికారులను కలిశామని, రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా తమను పట్టించుకోకపోవడం ఘోరమన్నారు. కోవిడ్ పేషంట్లకు తమ ప్రాణాలు అడ్డుపెట్టి వారికి సపర్యాలు చేశామని, చివరికి వారి



డైపర్ లను కూడ చేంజ్ చేశామన్నారు. ఆ సమయంలో తమలో ఐదుగురు కోవిడ్ సోకి చనిపోయారని గుర్తు చేశారు. గాంధీ ఆసుపత్రిలో నాన్ కోవిడ్ వార్డుల్లో ఇప్పుడు పేషంట్ కేర్ సిబ్బంది అవసరం ఉందని, ఉన్నతాధికారులు ఒక్కసారి ఆసుపత్రి విజిట్ చేస్తే ఆ విషయం తెలుస్తుందని, తమను వెంటనే విధుల్లోకి తీసుకొని, తమ కుటుంబాలను కాపాడాలని సిబ్బంది ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తేజ, శివప్రసాద్, స్వప్న,సరిత, భవానీ, వేణు, కావేరీ, లక్ష్మీ, నర్సింహా, అశోక్, గణేశ్, శంకర్, భారతి, పవన్, రాజేందర్, సాయి తదితరులు ఉన్నారు.

## పిట్టల రవీందర్‌ను సత్కరించిన పొట్లకాయల

**సికింద్రాబాద్, మే 24 ( ప్రజామంటలు):** ఇటీవల రాష్ట్ర మత్స్య సహకార సంఘల సమాఖ్య ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ పిట్టల రవీందర్ ముదిరాజ్‌ను ఆలిండియా ముదిరాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు బుధవారం హైదరాబాద్‌లో కలుసుకొని, ఆయన్ని ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, మిఠాయిలు తినిపించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న పిట్టల రవీందర్ కు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ లకు ఈసందర్భంగా పొట్లకాయల వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. పిట్టల రవీందర్ ముదిరాజ్ రాష్ట్రంలో దశాబ్దాల కాలంగా అనేక విధాలుగా నష్టపోతున్న ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



### పురుగుల మందు తాగి

## రైతు దంపతుల ఆత్మహత్య

**భీమదేవరపల్లి మే 24 (ప్రజామంటలు):** పురుగుల మందు తాగి రైతు దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రములో చోటు చేసుకుంది. సురుగురి రవి (50), స్వరూప (45) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేసారు. పెట్టుబడులకు తీసుకున్న అప్పు, ఈసారి కూడా పెట్టుబడికి అప్పయింది. దిగుబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో వారం రోజులుగా అప్పు ఎలా తీర్చాలనే విషయంపై దిగులుగా ఉంటున్నారు. ఇంటి దగ్గర ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగారు. అపస్మారకస్థితిలో ఉన్న దంపతులను 108 ద్వారా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో చేర్పించారు. ఎంజిఎంలో చికిత్సపొందుతూ వారు ఈ నెల 22 న మృతి చెందినట్లు వారి కుమారుడు సూరుగురి నవీన్ తెలిపారు. నవీన్ పిర్యాదు మేరకు విచారణ జరిపి పోస్ట్ మార్టం కోసం పంపినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

# పోలీస్ శాఖ కాషాయీకరణ కుదరదు

### రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సిందే

### ఘాటుగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి డికె

**బెంగళూరు,మే24(ప్రజా మంటలు):** కర్ణాటకలో శాంతి భద్రతల పరిస్థితి పై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పోలీసు అధికారులను హెచ్చరించారు. పోలీసు శాఖను కాషాయీకరణ చేసేందుకు ప్రయత్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సహించేది లేదని స్పష్టం చేశారు. చట్టాన్ని తమ చెప్పుచేతుల్లోకి తీసుకునేందుకు ఎవర్నీ అనుమతించం. పోలీసు అధికారులు 3,4 ప్రాంతాల్లో తమ ఎజెండాను పైకి తెచ్చారు. యూనిఫాం తీసేసి రాజకీయ పార్టీల దుస్తులు ధరించి, ఫోటోలకు ఫోజులిచ్చారు. ఇది పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం అని డీకే బుధవారంనాడు మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులతో డీకే మంగళవారంనాడు జరిపిన సమావేశంలోనూ ఈ అంశాన్ని కీలకంగా ప్రస్తావించినట్టు తెలుస్తోంది. బీజేపీ హయాంలో కొన్ని ఘటనలు జరిగాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు శాఖను కాషాయీకరణ చేసే ఎలాంటి ప్రయత్నాలు సహించేది లేదని సమావేశంలో ఆయన హెచ్చరించారు. పోలీసు శాఖను కాషాయీకరణం చేద్దామనుకుంటున్నారా? మా ప్రభుత్వంలో ఇలాంటివి సాగనీయం. మంగళూరు, బిజాపూరు, బాగల్‌కోట్‌లో మీరు కాషాయ దస్తులు ధరించి పోలీస్ శాఖను ఏవిధంగా అవమానించారో నాకు తెలుసు. దేశాన్ని మీరు గౌరవించదలచుకుంటే జాతీయపతాకంతో పనిచేయండని డీకే హెచ్చరించారు. పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లో అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ర్యాంకు అధికారుల ప్రమేయాన్ని ప్రస్తావిస్తూ, పోలీసు శాఖ ఎంత చెడ్డపేరు వస్తోందో చూడండని పోలీసు ఉన్నతాధికారులను ఈ సమావేశంలో డీకే నిలదీశారు. మంత్రివర్గ విస్తరణపై బుధవారంనాడు మీడియా సమావేశంలో




డీకే శివకుమార్ స్పష్టత ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ అనేది ముఖ్యమంత్రికి సంబంధించిన అంశమని, ఆయన అధికార పరిధిలోకి వస్తుందని చెప్పారు. దీనిపై సమాధానం చెప్పగలిగేది ఆయన మాత్రమేనని, ఆయననే కలుసుకొమ్మని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా డీకే చెప్పారు.

# తెలంగాణలో పెట్టుబడులకు స్వర్గధామం

### సులువుగా అనుమతులు ఇస్తున్నాం: మంత్రి

**సూర్యాపేట,మే24(ప్రజా మంటలు):** సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ కృషితో ఏర్పాటు చేసిన నూతన పారిశ్రామిక విధానం వల్ల పారిశ్రామిక వేత్తలకు సులభంగా అనుమతులు లభిస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు . సూర్యాపేట పట్టణంలోని రాయని గూడెం వద్ద చల్లా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వోల్ట్రాన్ ఎలక్ట్రిక్ చార్జింగ్ హబ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో పెట్రోల్ వాహనాలు కనుమరుగై పోతాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు . ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య ఒప్పందాలలో భాగంగా మన దేశంలో కూడా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలు హైదరాబాదులో తమ



సంస్థలను నెలకొల్పుతున్నాయని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. సూర్యాపేటలో



పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, బైరు వెంకన్న, జ్యోతి కరుణాకర్, ఉప్పల ఆనంద్, తోట శ్యామ్ ప్రసాద్, చల్లా లక్ష్మి కాంత్, చల్లా లక్ష్మి ప్రసాద్, బండారు రాజా, వోల్ట్రాన్ కంపెనీ ప్రతినిధులు రవిశంకర్, రాజా, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO , RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com